



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక







Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 21 బుధవారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 246
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# కేసీఆర్‌కు నోటీసులు

- కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న ఘోష్ కమిషన్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ
- పక్షంరోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసులు
- కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు,ఈటల రాజేందర్‌కు పిలుపు
- కేసీఆర్ జూన్ 5న,హరీశ్ 6న,ఈటల 9న విచారణకు హాజరుకావాలి

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

కాళేశ్వరం అవకతవకలపై కేసీఆర్‌కు ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసింది.కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన బ్యారేజీల కుంగుబాటుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ విచారణలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన బ్యారేజీల కుంగుబాటుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఈ విచారణలో భాగంగా కీలక

# ప్రపంచానికే మెడికల్ హబ్

- మన దేశానికి వైద్య ప్రపంచం ఇచ్చిన గుర్తింపు
- ప్రపంచంలో ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలోనే వైద్య ఖర్చులు చాలా తక్కువ
- అందుకే విదేశీయులు వైద్య చికిత్సల కోసం రాక
- అమెరికాతో పోలుస్తే 30 రెట్లు ఖర్చు తక్కువ
- తెలంగాణలో చికిత్స ఖర్చులు 60-80% తక్కువ

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

వైద్య ఖర్చులు మన దగ్గరే తక్కువట ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో వైద్య ఖర్చులు చాలా తక్కువగా ఉన్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో వైద్య ఖర్చులు చాలా తక్కువగా ఉన్నాయని తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇది నిజంగా భారతీయులకు, అలాగే విదేశాల నుంచి వైద్యం కోసం వచ్చే వారికి శుభవార్తే అని చెప్పొచ్చు. ముఖ్యంగా క్లిష్టమైన శస్త్రచికిత్సల విషయంలో కూడా మన దేశం చాలా సరసమైన ధరలకే ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందిస్తోందని నివేదికలు చెబుతున్నాయి. విదేశాలతో పోలిస్తే ఖర్చుల్లో భారీ వ్యత్యాసం ఒక హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీ (గుండె మార్పిడి) తీసుకుంటే ఇండియాలో దీనికి సుమారు రూ. 4.5 లక్షల నుంచి రూ. 35 లక్షల వరకు ఖర్చవుతుంది. అమెరికాలో మాత్రం ఏకంగా రూ. 1.4 కోట్ల వరకు ఖర్చవుతుందని తేలింది. అంటే, మన దేశంలో గుండె మార్పిడి ఖర్చు అమెరికాతో పోలిస్తే దాదాపు 30 రెట్లు తక్కువ. సింగపూర్, సౌత్ కొరియా వంటి దేశాల్లో కూడా వైద్య ఖర్చులు భారీగానే ఉంటాయి. కైలాస యాత్రకు ఆరంభంలోనే అడ్డంకులు.. కొండచరియల బీభత్సంతో చిక్కుకుపోయిన యాత్రికులు గుండె బైపాస్ సర్జరీ, హిప్ రీప్లేస్‌మెంట్, యాంజియోప్లాస్టీ, డెంటల్ ఇంప్లాంట్, కిడ్నీ మార్పిడి వంటి అనేక ప్రధాన చికిత్సల

# సినిమా చూపిస్తా

- మీరు ఏ పుస్తకంలో అయినా రాసుకోండి..
- వారికి సినిమా చూపించడం ఖాయం 2
- రిటైర్ అయినా లాక్కొస్తాం..విడిచిపెట్టం
- దేశం విడిచిపెట్టి వెళ్లినా తిరిగి రప్పిస్తాం
- మాజీ ముఖ్యమంత్రి జగన్ మాస్ వార్నింగ్



అమరావతి-నవభూమిబ్యూరో

వైసీపీ కార్యకర్తలు, నాయకులే టార్గెట్‌గా చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు చేస్తూ కక్ష సాధిస్తోందని మండిపడ్డారు కూటమి ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నిప్పులు చెరిగారు. వైసీపీ కార్యకర్తలు, నాయకులే టార్గెట్‌గా చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు చేస్తూ కక్ష సాధిస్తోందని మండిపడ్డారు. "కొడతానంటే కొట్టమనండి. మీరు ఏ పుస్తకంలోనైనా సరే వారి పేర్లు రాసుకోండి. ఆ అన్యాయం చేసిన వారికి సినిమా చూపిస్తాం. రిటైర్ అయినా లాక్కొస్తాం. దేశం

# ఢిల్లీ జోక్యం.. ఆగిన అరెస్ట్?

- మాజీ సీఎం జగన్ అరెస్ట్ అవుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం
- లిక్కర్ కుంభకోణంలో ఇప్పటికే తొమ్మిది మంది అరెస్టు
- జగన్ ఓఎస్డీతో పాటు,కార్యదర్శి సైతం అరెస్టు..విచారణ
- లిక్కర్ స్కాంలో కీలకంగా వ్యవహరించిన జగన్ అరెస్టవుతారన్న ప్రచారం
- ఇప్పటికే ఢిల్లీ పెద్దలను సీఎం చంద్రబాబు సంప్రదించినట్లు సమాచారం
- ఇప్పట్లో అరెస్టు వద్దంటూ ఢిల్లీ పెద్దలు సలహా ఇచ్చినట్లు వినికిడి

2



అమరావతి-నవభూమిబ్యూరో

మాజీ సీఎం జగన్ అరెస్ట్ అవుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇందుకు ముహూర్తం ఫిక్స్ అయిందని సోషల్ మీడియాలో పోస్టింగ్స్ కనిపిస్తున్నాయి. లిక్కర్ కేసులో ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్ట్ చేసారు. అందులో జగన్ కోర్ టీం సభ్యులు ఉన్నారు. జగన్ ఓఎస్డీతో పాటుగా సీఎం గా ఉన్న సమయంలో కార్యదర్శిగా పని చేసిన ధనుంజయ రెడ్డి అరెస్ట్ అయ్యారు. అయితే, జగన్ అరెస్ట్ వార్తల్లో నిజమెంత. ఢిల్లీ నుంచి అమరావతి వరకు ఈ వ్యవహారంలో ఏం జరుగు తోంది. తాజా పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారుతున్నాయి. జగన్ అరెస్ట్ ప్రచారంతో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ అరెస్ట్ కాబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ లావాదేవీల పైన విచారణకు ఆదేశించింది. ఇప్పటికే ఈ కేసులో సాయిరెడ్డి, మిథున్ రెడ్డి సైతం పలువురు విచారణకు హాజరు అయ్యారు. తాజాగా జగన్ సీఎంగా ఉన్న సమయంలో కీలకంగా వ్యవహరించిన ధనుంజయ రెడ్డి, క్రిష్ణ మోహన్ రెడ్డిని సైతం అరెస్ట్ చేసారు. ఈ కేసులో అరెస్ట్ ల పైన పార్టీ ముఖ్య నేతలతో జగన్ స్పందించారు. అసలు స్కాం లేని చోట.. రాజకీయంగా కుట్రలు చేసి అరెస్ట్ లు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అరెస్ట్ చేస్తే మూడు నెలలు చేయగలుగుతారు..ఆ తరువాత మాత్రం తప్పించు కోలేరని పేర్కొన్నట్లు తెలుస్తోంది. తమ హయాంలో అసలు మద్యం అమ్మకాల్లో అక్రమాలకు అవకాశమే లేదని జగన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. సిట్

# రేషన్ వాహనాలకి మంగళం

- గత ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీకి
- రూ.1860 కోట్లతో 9,260 వాహనాల కొనుగోలు
- నాలుగేళ్లుగా సక్రమంగా అందని రేషన్
- ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు సర్కారు నిర్ణయం

2



అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీలో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ అన్న విధానం తీసుకుని వచ్చింది. దాంతో గడచిన నాలుగేళ్ళుగా ఏపీలో రేషన్ వాహనాలు రోడ్ల మీద తిరుగుతున్నాయి

ఏపీలో వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇంటింటికీ రేషన్ అన్న విధానం తీసుకుని వచ్చింది. దాంతో గడచిన నాలుగేళ్ళుగా ఏపీలో రేషన్ వాహనాలు రోడ్ల మీద తిరుగుతున్నాయి. వీటికి మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్లుగా పేరు పెట్టింది. ఇలా మొత్తం తొమ్మిది వేల 260 కి పై

# మయన్మార్ నుంచి అక్రమ వలసలు


- హైదరాబాద్‌లో మయన్మార్ జాతీయుల అరెస్ట్
- ఏళ్ల క్రితం భారత్‌లోకి అక్రమ ప్రవేశం 2
- నకిలీ పత్రాలతో ఆధార్, పాన్, గ్యాస్ బుక్‌లు
- మదర్సా టీచర్ల సాయంతో మోసం
- ఇద్దరు నిందితులు పరారీ, పోలీసుల గాలింపు

పహల్గామ్ దాడి వెనుక కర్త, కర్మ జ్యోతి మల్హోత్రానే..? 2



# పంతుళ్ల కడుపుకొడుతున్న ఏఐ

- విద్యా రంగంలో సరికొత్త విప్లవం..
- తరగతి గదుల్లోకి ఏఐ టెక్స్ట్ బుక్స్!
- ఏఐ ట్యూటర్లు పర్సనలైజ్డ్ లెర్నింగ్ ఎక్స్ పీరియన్స్ 2
- పంతుళ్లకు భవిష్యత్తు గడ్డుకాలమే



7 నెలల్లో 25 మందితో పెళ్లిళ్లు
3
## బురిడీ..కిలేడీ

# డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు

- జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి
- ఏకగ్రీవంగా ఎన్నికకు కృషి చేసిన కూటమి నేతలు
- గతంలో డిప్యూటీ మేయర్‌గా పని చేసిన జియ్యానిపై
- అవిశ్వాసం నెగ్గడంతో అనివార్యమైన ఎన్నిక

2



విశాఖపట్నం-నవభూమిబ్యూరో

జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా జనసేనకు చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఎన్నికయ్యారు. కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జియ్యాని శ్రీధర్ డిప్యూటీ మేయర్ పదవిని కోల్పోయారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కొత్త డిప్యూటీ మేయర్ ఎన్నిక నిమిత్తం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయగా, కోరం లేక మంగళవారానికి వాయిదాపడిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎన్నికల అధికారి హోదాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. ఎన్నిక నిర్వహించడానికి 56 మంది సభ్యులు అవసరమని, హాజరైనవారి సంఖ్యను లెక్కించాలని రో అధికారులను ఆదేశించారు. ఏడుగురు ఎమ్మెల్యేలు, 52 మంది కార్పొరేటర్లు అప్పటికి హాజరైనట్టు అధికారులు నివేదించడంతో సమావేశాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. డిప్యూటీ మేయర్ పదవికి పోటీ చేయాలనుకునే అభ్యర్థిని ఒకరు ప్రతిపాదిస్తే, మరొకరు బలపరచాల్సి ఉంటుందని, ఇద్దరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే ఎన్నిక జరుపుతామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు పేరును పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు గణబాబు ప్రతిపాదించగా, ఉత్తరం నియోజకవర్గ శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు.

# కైలాస యాత్రకు అడ్డంకులు

- వర్షాల ధాటికి విరిగిపడుతున్న కొండ చరియలు
- మార్గమధ్యంలోనే చిక్కుబడిపోయిన వందలాది మంది భక్తులు
- కొండ చరియలు విరిగిపడి మూసుకుపోయిన రోడ్డు మార్గం
- శిథిలాలను తొలగించే పనుల్లో నిమగ్నమైన బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

కైలాస యాత్రకు ఆరంభంలోనే అడ్డంకులు.. కొండచరియల బీభత్సంతో చిక్కుకుపోయిన యాత్రికులు కొండచరియలు ఒక్కసారిగా విరిగిపడటంతో కైలాస్-మానస సరోవర్ యాత్రకు బయలుదేరిన వందలాది మంది భక్తులు మధ్యలోనే చిక్కుకుపోయారు.
ఉత్తరాఖండ్‌లో ప్రకృతి ప్రకోపం మరోసారి యాత్రికులను ఉక్కిరిబిక్కిరి చేసింది. కొండచరియలు ఒక్కసారిగా విరిగిపడటంతో కైలాస్-మానస సరోవర్ యాత్రకు బయలుదేరిన వందలాది మంది భక్తులు మధ్యలోనే చిక్కుకుపోయారు. పితోరాగఢ్ జిల్లా సమీపంలోని కైలాస్ యాత్ర మార్గంలో జరిగిన ఈ ఘటనతో యాత్రికులే కాదు.. స్థానికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ ప్రారంభం కానున్న యాత్రకు ఇది పెద్ద షాక్ అనే చెప్పాలి. పితోరాగఢ్ జిల్లాలో ఆది కైలాస్ మార్గంలో కొండచరియలు విరిగిపడటంతో రోడ్డు పూర్తిగా మూసుకుపోయింది. దీంతో యాత్రికులు, స్థానికులు ఎవరూ ముందుకు వెళ్లలేక ఇరుక్కుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక యంత్రాంగం సహాయక చర్యలు మొదలుపెట్టింది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందాలు ఇప్పటికే శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమయ్యాయి. సంతోషకరమైన విషయమేంటంటే, ఈ ఘటనలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు ధృవీకరించారు. పరిస్థితులు చక్కబడే వరకు

# తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దు

- కోరం లేకపోవటంతో రద్దు చేసిన ఎన్నికల అధికారులు
- వైసీపీ సభ్యులంతా గైర్హాజరు
- టీడీపీకి మద్దతుగా ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు
- వైసీపీ నేత దేవినేని అవినాష్ అరెస్టయినట్లు ప్రచారం

2

**తిరువూరు-నవభూమి:** తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రద్దైంది. మంగళవారం జరిగిన ఎన్నికకు సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో ఎన్నిక రద్దు చేస్తున్నట్లు ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు సమావేశ మందిరంలో ఆమె సభ్యుల కోసం వేచి చూశారు. గడువు ముగిశాక కూడా టీడీపీ, వైసీపీ సభ్యులు రాకపోవడంతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించి, తదుపరి చర్యల కోసం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపుతామని తెలిపారు.

**కార్యాలయం వద్దే వేచి ఉన్న టీడీపీ కౌన్సిలర్లు**

# చంద్రబాబూ మీరు సూపర్

- ఏపీ సీఎంపై బిల్ గేట్స్ ప్రశంసలు వర్షం



2

అమరావతి-నవభూమిబ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిభకు ఫిదా అవుతున్నట్లు లేఖ రాశారు గేట్స్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్.. తమ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాల సాధనకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిభకు ఫిదా అవుతున్నట్లు లేఖ రాశారు గేట్స్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్.. తమ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాల సాధనకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. చంద్రబాబు కష్టం ఊరకే పోదని, ఆంధ్రప్రదేశ్ తోపాటు భారతదేశానికి ఇతర అల్పాదాయ దేశాలకు ఎంతో ఉపయోగపడుతుందని అభినందించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్ | బుధవారం | 21 ၊ మే ၊ 2025

## నవ వార్త



## నవ వరుడి జీవితంలో ఊహించని విషాదం..



**మహబూబాబాద్-నవభూమి:** వధువు కాళ్ల పారాణి ఆరకముందే పెను విషాదం చోటుచేసుకుంది. పెళ్లి కూతురు కట్టుకున్న కలల సౌధం పేక మేడలా కూలిపోయింది. పెళ్లి జరిగిన మరుసటి రోజే పెళ్లి కుమారుడు చనిపోయాడు. రిసెప్షన్‌కు కొన్ని గంటల ముందు వరుడు విగత జీవిలా మారాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ పెను విషాదానికి సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, కోడిపుంజుల తండాకు చెందిన25 ఏళ్ల ఇస్లావత్ నరేష్, అదే ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల జాహ్నవికి పెళ్లి నిశ్చయం అయింది.నిన్న ఇద్దరికీ ఘనంగా పెళ్లి జరిగింది. ఈ రోజు రిసెప్షన్‌కు ఏర్పాట్లు జరుగుతూ ఉన్నాయి. మరికొన్ని గంటల్లో రిసెప్షన్ మొదలవ్వనుంది. నరేష్ కరెంట్ మోటార్ ఆన్ చేస్తుండగా.. షాక్‌కు గురయ్యాడు. అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. నరేష్ చనిపోవటం జాహ్నవి తట్టుకోలేకపోయింది. కళ్లు తిరిగి పడిపోయింది.

వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించా రు. నరేష్ మరణంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నరేష్ పెళ్లి రిసెప్షన్ రోజే కన్నుమూయటంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మయన్మార్ నుంచి అక్రమ వలసలు

**హైదరాబాద్-నవభూమి:**హైదరాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తూ, నకిలీ పత్రాలతో భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందిన మయన్మార్ దేశస్థుల ముఠా గుట్టు రట్టయింది. రాచకొండ ఎస్ఓటీ పోలీసులు మంగళవారం జరిపిన దాడుల్లో మయన్మార్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. వీరు కొన్నేళ్ల క్రితం మయన్మార్ నుంచి అక్రమంగా మన దేశంలోకి ప్రవేశించి, ఇక్కడ తప్పుడు ధృవపత్రాలు సృష్టించి ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు పొందినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మదర్సాలో పనిచేసే కొందరు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తేలింది.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, మయన్మార్‌కు చెందిన మహ్మద్ అమీన్, ఆయన భార్య మహ్మద్ రుమానా అక్తర్, వారి కుమారుడు మహ్మద్ నయీమ్ 2011 సంవత్సరంలో అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. అనంతరం 2014లో హైదరాబాద్ నగరానికి చేరుకుని, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నారు. మహ్మద్ అమీన్ స్థానికంగా ఓ బ్యాటరీ దుకాణాన్ని నడుపుతున్నాడు.

వారు అక్రమంగా ఆధార్ కార్డులు పొందిన వైనంపై పోలీసులు దృష్టి సారించారు. మదర్సాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మహ్మద్ హారీస్, అయాజ్‌ల సహాయంతో మహ్మద్ అమీన్ మంచాల గ్రామంలోని మీ-సేవా కేంద్రం ద్వారా ఆధార్ కార్డు సంపాదించినట్లు విచారణలో తేలింది. ఆ తర్వాత, నకిలీ వివాహ ధృవపత్రాన్ని సృష్టించి, దాని ఆధారంగా తన భార్య రుమానా అక్తర్‌కు కూడా ఆధార్ కార్డు ఇప్పించాడు. ఇక వీరి కుమారుడైన నయీమ్‌కు, మయన్మార్ నుంచే అక్రమంగా వచ్చి బాలాపూర్‌లో స్థిరపడిన షోయబ్ మాలిక్ అనే వ్యక్తి నకిలీ పత్రాలతో ఆధార్ కార్డు వచ్చేలా చేశాడు.ఈ కుటుంబం తప్పుడు పత్రాలను సమర్పించి ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందిన వ్యవహారంపై పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన రాచకొండ ఎస్ఓటీ పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ ఆధార్ కార్డులతో పాటు, వాటి ఆధారంగా పొందిన పాన్ కార్డులు, గ్యాస్ బుక్‌లు, బ్యాంకు ఖాతాలు, పాస్‌బుక్‌లు వంటి ఇతర కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి సహకరించిన అయాజ్, షోయబ్ మాలిక్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు వివరించారు.

## కైలాస యాత్రకు అడ్డంకులు

**(1వపేజీ తరువాయి)**యాత్రికులు సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని అధికారులు సూచించారు. పవిత్రమైన కైలాస్-మానస సరోవర్ యాత్ర గత ఐదేళ్లుగా నిలిచిపోయింది. 2020లో కరోనా మహమ్మారి కారణంగా ఈ యాత్ర ఆగిపోయింది. ఆ తర్వాత గల్వాన్ లోయ ఘర్షణల వల్ల భారత్, చైనాల మధ్య సంబంధాలు దెబ్బతినడంతో యాత్ర పునరుద్ధరణపై ఎలాంటి అడుగులు పడలేదు. అయితే, గత ఏడాది రష్యాలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన భేటీ తర్వాత ఇరు దేశాల సంబంధాలు సాధారణ స్థితికి రావడంతో యాత్రకు మళ్లీ గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ ఏడాది జూన్ నుండి ఆగస్టు వరకు యాత్ర కొనసాగనున్నట్లు కేంద్ర ప్రభుత్వం గత నెలలో అధికారికంగా ప్రకటించింది. ఉత్తరాఖండ్, సిక్కిం మార్గాల ద్వారా ఈ యాత్ర సాగుతుంది. 50 మంది యాత్రికుల చొప్పున 5 బృందాలు ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ నుంచి, 10 బృందాలు సిక్కిం నాథులా పాస్ నుంచి బయలుదేరుతాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. యాత్ర కోసం kmy.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కంప్యూటర్ ద్వారా లాటరీ పద్ధతిలో యాత్రికులను ఎంపిక చేస్తారు. హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో కైలాస పర్వతం ఒకటి. సాక్షాత్తూ పరమశివుడు ఇక్కడే నివాసముంటాడని భక్తులు విశ్వసిస్తారు. కైలాస పర్వతానికి చేరువలోనే మానస సరోవరం సరస్సు కూడా ఉంది. ఇది బ్రహ్మ ముహూర్తంలో దేవతలు స్నానం చేసే ప్రదేశంగా నమ్ముతారు. టిబెట్‌లో ఉన్న ఈ రెండు సుమనోహర పుణ్యక్షేత్రాలు హిందువులకే కాకుండా, జైనులు, బౌద్ధులకు కూడా చాలా పవిత్రమైనవి. ప్రపంచం నలుమూలల నుంచి ప్రతేడాది వేలాది మంది భక్తులు కైలాస-మానస సరోవర్ యాత్రలో పాల్గొంటారు. ఇలాంటి పవిత్ర యాత్రకు ముందు కొండచరియలు విరిగిపడటం భక్తులలో ఆందోళన కలిగిస్తోంది.

## పంతుళ్ల కడుపుకొడుతున్న ఏఐ

**న్యూయార్క్-నవభూమిబ్యూరో**

ఇక బడుల్లో టీచర్లు కనుమరుగు కాబోతున్నారా ? పాఠాలు చెప్పడానికి రోబోలు రాబోతున్నాయా? డ్యులింగో సీఈవో లూయిస్ వాన్ ఆన్ చేసిన ఒక సంచలన ప్రకటన విద్యా రంగాన్ని కుదిపేస్తోంది. భవిష్యత్తులో బోధన మొత్తం ఏఐ ట్యూటర్లే చేస్తారని ఆయన జోస్యం చెప్పారు. బోధన రంగంలో రాబోయే రోజుల్లో పెను మార్పులు చోటుచేసుకోబోతున్నాయట. పాఠాలు చెప్పడానికి ఇకపై మనుషులు అవసరం లేకుండా పోతుందట. భవిష్యత్తులో టీచర్ల స్థానాన్ని కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) భర్తీ చేయనుందని ప్రముఖ భాషా అభ్యాస వేదిక డ్యులింగో సీఈవో లూయిస్ వాన్ ఆన్ తెలిపారు. భవిష్యత్తులో బోధన మొత్తం ఏఐ ట్యూటర్లే చేస్తారని ఆయన సంచలన అంచనా వేశారు. ఏఐ వచ్చిన తర్వాత పాఠశాలల్లో ఎక్కువగా పిల్లల సంరక్షణ (చైల్డ్ కేర్), పర్యవేక్షణ (సూపర్ విజన్) వంటి విధులు మాత్రమే ఉంటాయని ఆయన కుండబద్దలు కొట్టారు. అంతేకాకుండా, దక్షిణ కొరియాలో ఇప్పటికే తరగతి గదుల్లో ఏఐ టెక్స్ట్ బుక్స్‌ను వినియోగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు విద్యా రంగంలో ఒక కొత్త చర్చకు దారితీశాయి. లూయిస్ వాన్ ఆన్ అభిప్రాయం ప్రకారం.. ఏఐ ట్యూటర్లు పర్సనలైజ్డ్ లెర్నింగ్ ఎక్స్ పీరియన్స్ అందించగలవు. ప్రతి విద్యార్థి అవసరాలు, వారి వేగం, వారి బలహీనతలను గుర్తించి, దానికి అనుగుణంగా పాఠాలను రూపొందించగలవు. ఒకే తరగతి గదిలో ఉన్నప్పటికీ, ప్రతి విద్యార్థికి వారి స్థాయికి తగిన విధంగా బోధన అందుతుంది. దీనివల్ల విద్యార్థులు మరింత సమర్థవంతంగా నేర్చుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా, ఏఐ ట్యూటర్లు 24/7 అందుబాటులో ఉండగలవు, విద్యార్థులు ఎప్పుడు కావాలంటే అప్పుడు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. %కూశ్రీంశీ =ఝుం% - కైలాస యాత్రకు ఆరంభంలోనే అడ్డంకులు.. కొండచరియల బీభత్సంతో చిక్కుకుపోయిన యాత్రికులు అయితే, ఏఐ ట్యూటర్లు వచ్చిన తర్వాత టీచర్ల పాత్ర పూర్తిగా మారిపోతుందని లూయిస్ వాన్ ఆన్ అంటున్నారు. వారి ప్రధాన బాధ్యత బోధన కాకుండా పిల్లల శారీరక, మానసిక సంరక్షణ, అలాగే వారి అభ్యాస ప్రక్రియను పర్యవేక్షించడం వంటి వాటికే పరిమితం కావచ్చు. టీచర్లు ఒక రకంగా పిల్లలకు మెంటర్‌లుగా, గైడ్‌లుగా మారే అవకాశం ఉంది. దక్షిణ కొరియాలో ఏఐ టెక్స్ట్ బుక్స్ వినియోగం అనేది ఈ దిశగా ఒక ముందడుగుగా చూడవచ్చు. సాంప్రదాయ పాఠ్యపుస్తకాలకు బదులుగా, ఏఐ ఆధారిత టెక్స్ట్ బుక్స్ విద్యార్థుల అభ్యాస స్థాయిని విశ్లేషించి, వారికి మరింత అనుకూలమైన కంటెంట్‌ను అందిస్తాయి. ఇది విద్యార్థులు మరింత ఆసక్తిగా నేర్చుకోవడానికి సహాయపడుతుంది. ఏఐ ట్యూటర్లు పూర్తిగా టీచర్ల స్థానాన్ని భర్తీ చేయగలవా అనే ప్రశ్న ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. విద్యార్థులకు కేవలం జ్ఞానాన్ని అందించడంతో పాటు, వారిలో నైతిక విలువలు, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడంలో టీచర్లు కీలక పాత్ర పోషిస్తారు.

## మాయ లేడీలు.. పెళ్లి చేస్తానంటే నమ్మాడు.. ఊహించని షాక్..



**మహబూబాబాద్-నవభూమి:**ఈ మధ్య కాలంలో పెళ్లిళ్ల పేరుతో మోసాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మోసగాళ్లు ఆఖరికి వృద్ధులను కూడా వదలటం లేదు. రెండో పెళ్లి చేస్తామంటూ నమ్మించి, మోసం చేస్తున్నారు. వృద్ధులను టార్గెట్ చేసి మోసాలకు పాల్పడుతున్న మాయ లేడీల గుట్టు రట్టయింది. ఓ ఇద్దరు మహిళలు వృద్ధులకు పెళ్లి చేస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నారు. వారి కారణంగా మోస పోయిన ఓ వృద్ధుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లటంతో విషయం వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే..హైదరాబాద్‌కు చెందిన ఓ ఇద్దరు మహిళలు ఓ ఫేక్ మ్యారేజ్ బ్యూరోను ఏర్పాటు చేశారు. ముసలి వాళ్లకు పెళ్లిళ్లు చేస్తామంటూ ప్రచారం చేశారు. సంపన్నులు, రిటైర్మెంట్ తీసుకున్న ఉద్యోగులను టార్గెట్ చేసుకుని తమ ప్లాన్ అమలు చేశారు. ఓ వృద్ధుడు వీరి ఉచ్చులో చిక్కుకున్నాడు. అతడికి గుర్తు తెలియని మహిళతో పెళ్లి నిశ్చయం చేశారు. పెళ్లి షాపింగ్ పేరుతో రెండు లక్షల రూపాయలు కాజేశారు.పెళ్లి రోజు రానే వచ్చింది. ఆ వృద్ధుడు పెళ్లి బట్టలతో .. ఆ మహిళల పిలుపు కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. ముహూర్త సమయం దాటిపోయి గంటలు గడిచినా ఎవ్వరూ రాలేదు. దీంతో మోసపోయానని భావించిన ఆ పెద్దాయన మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ ఇద్దరు కిలేడీ లేడీస్ కోసం గాలిస్తున్నారు.

## ప్రపంచానికే మెడికల్ హబ్

**(1వపేజీ తరువాయి)**విషయంలోనూ ఇదే పరిస్థితి. ఉదాహరణకు, బైపాస్ సర్జరీకి మన దగ్గర రూ. 2.5 లక్షల నుంచి రూ. 4.5 లక్షల వరకు ఖర్చవుతుండగా ఇతర దేశాల్లో దీనికి రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు వెచ్చించాల్సి వస్తుంది. ఎందుకు ఇండియాలో తక్కువ ఖర్చులు? తక్కువ ఆపరేషనల్ ఖర్చులు: మన దేశంలో ఆస్పత్రుల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలు, పరికరాల కొనుగోలు ఖర్చులు ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. అధిక సంఖ్యలో వైద్య నిపుణులు: ఇండియాలో అర్హత కలిగిన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నారు. దీనివల్ల కార్మికుల కొరత ఉండదు. వేతనాలు కూడా ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉంటాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, పోటీతత్వం: ప్రభుత్వ ఆస్పత్రులు తక్కువ ఖర్చుతో సేవలు అందిస్తూ, ప్రైవేట్ ఆస్పత్రులపై ధరల విషయంలో ఒక పోటీని సృష్టిస్తాయి. అలాగే, మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడాని కి ప్రభుత్వం వివిధ చర్యలు చేపడుతోంది. ఫార్మా రంగం అభివృద్ధి: మందులు, వైద్య పరికరాల ఉత్పత్తిలో భారతదేశం అగ్రగామిగా ఉంది. దీనివల్ల చికిత్సకు అవసరమైన మందులు, పరికరాల ఖర్చు తక్కువగా ఉంటుంది. భారీ జనాభా: పెద్ద జనాభా ఉండటం వల్ల ఎక్కువ మంది రోగులు ఉంటారు. ఇది వైద్య సేవలకు డిమాండ్‌ను పెంచుతుంది. తద్వారా ఖర్చులు తక్కువగా ఉండేలా చూస్తుంది. మెడికల్ టూరిజంలో దూసుకెళ్తున్న ఇండియా భారతదేశంలో తక్కువ ఖర్చులతో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో ప్రపంచవ్యాప్తంగా చాలా మంది రోగులు చికిత్స కోసం మన దేశాన్ని ఆశ్రయిస్తున్నారు. దీన్నే 'మెడికల్ టూరిజం' అంటారు. హైదరాబాద్ వంటి నగరాలు ఇప్పటికే మెడికల్ టూరిజానికి గ్లోబల్ హబ్‌లుగా మారుతున్నాయి. యూరప్, అమెరికా వంటి దేశాలతో పోలిస్తే తెలంగాణలో చికిత్స ఖర్చులు 60 నుంచి 80 శాతం తక్కువగా ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. అందుకే విదేశాల నుంచి పెద్ద ఎత్తున రోగులు ఇక్కడికి వస్తున్నారు. క్లిష్టమైన సర్జరీలు, క్యాన్సర్ చికిత్సలు, గుండె సంబంధిత వ్యాధులు, అవయవ మార్పిడి వంటి వాటికి మన దేశం ఒక నమ్మకమైన చికిత్సా కేంద్రంగా మారుతోంది. ప్రపంచ స్థాయి సౌకర్యాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, నిష్ణాతులైన వైద్య నిపుణులు తక్కువ ధరకే అందుబాటులో ఉండటం వల్ల ఇండియా 'వరల్డ్ ఫార్మసీ'గానే కాకుండా, 'వరల్డ్ హెల్త్‌కేర్ డెస్టినేషన్'గా కూడా రూపాంతరం చెందుతోంది. ఈ నివేదికలు భారత్ వైద్య రంగంలో మరింత బలపడటానికి దోహదపడతాయని చెప్పొచ్చు.

## కేసీఆర్‌కు నోటీసులు

**(1వపేజీ తరువాయి)**నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు (కేసీఆర్), మాజీ మంత్రి హరీశ్‌రావు, భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌లకు నోటీసులు జారీ చేసింది. ఈ ముగ్గురూ 15 రోజుల్లోగా కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రిగా, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేసిన నేపథ్యంలో ఈ నోటీసులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కమిషన్ ఆదేశాల ప్రకారం, కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాల్సి ఉంది.

కమిషన్ విచారణ నేపథ్యం: మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ నాణ్యత, నిర్వహణపై లోతైన విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్‌ను 2024 మార్చిలో నియమించింది. ఈ కమిషన్ నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ అకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సీనియర్ ఇంజినీర్లను విస్తృతంగా విచారించింది.గడువు పొడిగింపులు, చివరి దశ విచారణ: కమిషన్ విచారణ ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఇప్పటివరకు 7 సార్లు గడువును పొడిగించింది. గత నెలాఖరులో ఒక నెల మాత్రమే గడువు పొడిగించగా, దీని ప్రకారం ఈ నెలాఖరుకు కమిషన్ గడువు పూర్తికావాలి. వాస్తవానికి, ఈ నెల 21 లేదా 22న జస్టిస్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించవచ్చని ప్రచారం జరిగింది. - మాజీ మంత్రులకు నోటీసుల వెనుక కారణం: అయితే విచారణలో భాగంగా చాలా మంది సీనియర్ ఇంజినీర్లు, అధికారులు తమ నిర్ణయాలు గత ముఖ్యమంత్రి సమక్షంలోనే జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే పలు నిర్ణయాలను అమలు చేశామని కమిషన్‌కు తెలియజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆ నిర్ణయాలపై కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని కమిషన్ భావించినట్లు తెలుస్తోంది. ఈ కీలక వ్యక్తుల వాంగ్మూలం కమిషన్ తుది నివేదికకు మరింత స్పష్టతను ఇస్తుందని భావిస్తున్నారు. ఈ నోటీసులతో కాళేశ్వరం బ్యారేజీల కుంగుబాటుపై విచారణ మరింత కీలక మలుపు తీసుకుంది.

## సినిమా చూపిస్తా

**(1వపేజీ తరువాయి)**విడిచిపెట్టి వెళ్లినా తిరిగి రప్పిస్తాం" అంటూ హెచ్చరించారు. తాడేపల్లిలో పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులతో మాజీ సీఎం జగన్ భేటీ అయ్యారు. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్, పార్వతీపురం, రామచంద్రాపురం మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లతోపాటు రామగిరి మండలానికి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్ లతో మాజీ సీఎం జగన్ సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై వారితో చర్చించిన జగన్ కూటమి ప్రభుత్వం అక్రమంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తమ పార్టీ హయాంలో ఇలాంటి రాజకీయాలు చేయలేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థలను మనం క్లీన్ స్వీప్ చేశాం, తాడిపత్రిలో టీడీపీ గెలిచింది. ఆ పార్టీ కౌన్సిలర్లను మనం లాగేద్దామని అప్పటి ఎమ్మెల్యే అడిగితే తాను ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేసి టీడీపీ గెలిచే వాతావరణం కల్పించినట్లు చెప్పారు. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో బలం లేకపోయినా బలవంతంగా మున్సిపాలిటీల్లో గెలవాలని అనుకుంటున్నారని ఆరోపించారు. తిరువూరు నగర పంచాయతీలో టీడీపీకి బలం లేకపోవడంతో ఎన్నిక జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. సంఖ్యాబలం లేకుండా పోటీకి పెట్టి లాగేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. పోలీసులు వైసీపీవాళ్లను మాత్రమే అరెస్టు చేస్తున్నారని జగన్ మండిపడ్డారు. నరసారావుపేట, కారంపూడి, కుప్పం మున్సిపాలిటీల్లో ఇదే విధంగా బలవంతంగా మున్సిపాలిటీ చైర్మన్ పదవులను లాక్కున్నారని ఆరోపించారు. ఒక పార్టీ గుర్తుతో గెలిచిన వాళ్లను వేరే పార్టీలోకి తీసుకోవడం, ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవారు అక్రమాలను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వంపైన అయినా వ్యతిరేకత రావడానికి కాస్త సమయం పడుతుంది. కానీ, చంద్రబాబు పాలనపై నెలల వ్యవధిలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని జగన్ చెప్పారు. మన కన్న ఎక్కువ చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చాడు. జగన్ ఇచ్చినవన్నీ ఇస్తాను అంతకంటే ఎక్కువ ఇస్తానన్నాడు కానీ వాటన్నింటినీ తుంగలో తొక్కాడని ధ్వజమెత్తారు. 99 శాతం హామీలను అమలు చేసిన ఏకైక పార్టీ దేశంలో వైసీపీ ఒక్కటేనని స్పష్టం చేశారు. మనం చేసిన మంచి ఎక్కడికీ పోదని నేతలకు ధైర్యం చెప్పిన మాజీ సీఎం జగన్.. పార్టీ కార్యకర్తలను వేధిస్తున్న వారు ఎక్కడున్నా అధికారంలోకి వచ్చాక సినిమా చూపిస్తానంటూ మాస్ వార్నింగిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని, ప్రశ్నిస్తున్నవారిని అణిచివే స్తున్నారని ధ్వజమెత్తారు. చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా తప్పుడు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ 2.0లో కార్యకర్తలకు ప్రాధాన్యమిస్తానని హామీ ఇచ్చారు.

## దిల్లీ జోక్యం.. ఆగిన అరెస్ట్?

**(1వపేజీ తరువాయి)**దూకుడు మద్యం కేసులో సిట్ విచారణలు - అరెస్ట్ లతో దూకుడుగా వ్యవహరిస్తోంది. సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ లో నమోదు చేసిన నిందితుల్లో జగన్ పేరు లేదు. అయితే, జగన్ పేరు లేకపోయినా అరెస్ట్ చేయకూడదనే నిబంధన లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో జరిగిన నగదు లావా దేవీలకు సంబంధించి ఆధారాలు.. స్టేట్మెంట్స్ కీలకంగా మారుతున్నాయి. అంతిమంగా లబ్ది దారు ఎవరనే కోణంలో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. పక్కా ఆధారాలు దొరికితే నే జగన్ ను అరెస్ట్ చేస్తారనే వాదన అధికార పార్టీ నేతల నుంచి వినిపిస్తోంది. లిక్కర్ పై సిట్ విచారణ కొనసాగుతున్న సమయంలో వైసీపీ హయాంలో జంగారెడ్డి గూడెంలో జరిగిన లిక్కర్ మరణాల పైన మరో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. రాజకీయ పర్యవసానాలు జగన్ అరెస్ట్ అయితే రాజకీయంగా చోటు చేసుకునే పర్యవసానాల పైన కూటమి నేతల్లో చర్చ జరుగుతోంది. జగన్ అరెస్ట్ పైన బీజేపీ నాయకత్వంతోనూ సంప్రదించాల్సి ఉంటుందనే వాదన పార్టీ నేతల్లో వినిపిస్తోంది. జగన్ సీఎంగా ఉన్న సమయంలో జరిగిన అరెస్టులు.. స్కిల్ కేసులో చంద్రబాబును జైలుకు పంపటం.. ఆ తరువాత వరుసగా నమోదు చేసిన కేసులతో ప్రజల్లో వచ్చిన అభిప్రాయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు జగన్ ను అరెస్ట్ చేస్తే రాజకీయ ప్రతీకార చర్యగా భావించే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. దీంతో, పూర్తి ఆధారాలు సేకరించిన తరువాతనే తుది నిర్ణయం ఉంటుందని భావిస్తున్నారు. అదే విధంగా జగన్ అరెస్ట్ విషయంలో బీజేపీ అధినాయకత్వం మూడ్ కీలకంగా మారుతోంది. పూర్తి ఆధారాలు ఢిల్లీ నేతలకు ఇప్పటికే పంపారని చెబుతున్నారు. కాగా, జగన్ అరెస్ట్ విషయంలో రాజకీయంగా తుది నిర్ణయం జరగలేద నేది అర్దం అవుతోంది. దీంతో.. రానున్న రోజుల్లో జగన్ విషయంలో తీసుకునే నిర్ణయాలు ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారటం ఖాయంగా కనిపిస్తోంది.

## రేషన్ వాహనాలకి మంగళం

**(1వపేజీ తరువాయి)**చిలుకు వాహనాలను ఏకంగా 1860 కోట్ల రూపాయలను వెచ్చించి వైసీపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. పైగా ఈ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయడానికి నెలకు ఒక్కో వాహనానికీ 27 వేల రూపాయలు చెల్లిస్తూ వచ్చింది.

ఇంత చేసినా కూడా ప్రజలందరికీ రేషన్ అందడం లేదు. ముప్పయి శాతం ప్రజానీకానికి రేషన్ పంపిణీ కావడం లేదని ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలో వెల్లడి అయింది. దాంతో ఈ విధానం వల్ల ఎక్కడా జవాబుదారీ తనం లేదని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఇక రేషన్ సరుకులు ఎక్కడికి వెళు_న్నాయో కూడా ఎవరికీ తెలియడం లేదని అంటున్నారు. ఇదే కాదు మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్లు వాహణదారుల మీద పెద్ద ఎత్తున క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయని అంటున్నారు. ఇలా చౌక బియ్యం అక్రమ రవాణా కోసం ఏకంగా ఒక గ్రీన్ చానల్ ని ఏర్పాటు చేసుకుని వాహనాల ఆపరేటర్లు దందా చేస్తున్నారు అని అంటున్నారు. దొంగ లెక్కలు చూపించి మరీ బియ్యాన్ని దారి మళ్ళించారు అని అంటున్నారు. దీంతో ప్రభుత్వానికి అధిక భారంతో పాటు ప్రజలకు ఏ మేరకు మేలు చేయని మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్లు వ్యవస్థను రద్దు చేయడమే మంచి విధానం అని కూటమి ప్రభుత్వం భావించింది. దాంతోనే వాహనాలు రద్దు చేయడం ఉత్తమ నిర్ణయంగా తీసుకున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇక మీదట చౌక దుకాణాల వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. ఇది పేదలకు ప్రయోజనం కలిగించే విధానంగా ఉంటుందని అన్నారు. మొత్తం మీద చూసుకుంటే రేషన్ వాహనాలకు చెల్లు చీటి రాశారు. అయితే ఈ నిర్ణయం పట్ల ప్రజల నుండి సానుకూల స్పందన వస్తోంది. రేషన్ వాహనాలు ఎపుడు వస్తాయో తెలియదని దుకాణం వద్ద అయితే తమకు వీలు అయిన సమయాలలో వచ్చి సరుకులు తీసుకుంటామని తెల్లరేషన్ కార్డు దారులు అంటున్నారు. అయితే చౌక దుకాణాలను తెరచి ఉంచాలని వారు కోరుతున్నారు. మొత్తానికి రేషన్ వాహనానికి మంగళం పాడేశారు అన్నది వాస్తవం.

## డిప్యూటీ మేయర్‌గా దల్లి గోవిందరాజు

**(1వపేజీ తరువాయి)**ఇంకెవరైనా పోటీలో ఉన్నారా? అని జాయింట్ కలెక్టర్ అడగ్గా...సభ్యుల నుంచి సమాధానం లేకపోవడంతో గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రాన్ని దల్లిదోవిందరాజుకు అందజేశారు. ఆ సమయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతోపాటు మరికొందరు కార్పొరే టర్లు సమావేశానికి హాజరైనప్పటికీ వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకోబోమని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. వెంటనే దల్లి గోవిందరాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## చంద్రబాబూ మీరు సూపర్

**(1వపేజీ తరువాయి)**కొద్ది రోజుల క్రితం ఢిల్లీలో ఏపీ ప్రభుత్వం-బిల్ గేట్స్ ఫౌండేషన్ మధ్య జరిగిన ఒప్పందం నేపథ్యంలో చంద్రబాబు నాయకత్వాన్ని కొనియాడుతూ బిల్ గేట్స్ రాసిన లేఖ వైరల్ అవుతోంది. నాలుగో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నెరవేర్చుతున్న చంద్రబాబుకు బిల్ గేట్స్ తో దాదాపు మూడు దశాబ్దాల అనుబంధం ఉంది. ఆయన ప్రపంచ కుబేరుడిగా ఉన్న సమయంలోనే హైదరాబాద్ కు ఆహ్వానించి ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి బాటలు వేశారు చంద్రబాబు. 1995లో చంద్రబాబు తొలిసారి సీఎం అయిన తర్వాత రాష్ట్రం ఆర్థికంగా పురోగమించడంతోపాటు నిరుద్యోగ సమస్య నివారణకు ఐటీని ప్రోత్సహించారు. ఇందుకు మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ సహకారం కావాలని భావించి ప్రత్యేకంగా అమెరికా వెళ్లి, ఆయనతో భేటీ అయ్యారు. చంద్రబాబు ఆహ్వానం మేరకు అప్పట్లో హైదరాబాద్ కు వచ్చిన బిల్ గేట్స్ మైక్రోసాఫ్ట్ స్థాపించారని చెబుతారు. ఆ తర్వాత ప్రపంచయ ఇక విభజన తర్వాత ఏపీలో ఐటీతోపాటు ఏఐ, క్వాంటమ్ కంప్యూటరింగ్, డీప్ టెక్ టెక్నాలజీలను ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు గత జనవరిలో జరిగిన దావోస్ ఆర్థిక సదస్సులో బిల్ గేట్స్ తో భేటీ అయ్యారు. గేట్స్ ఫౌండేషన్ సేవలను ఏపీలో అందజేయాలని కోరారు. ఆ తర్వాత ఢిల్లీలో చంద్రబాబు-బిల్ గేట్స్ మధ్య భేటీ జరిగింది. ఏపీ ప్రభుత్వానికి విద్య, వైద్యం, వ్యవసాయ ఉత్పత్తుల సేవల విషయంలో సహకారం అందజేయడానికి బిల్ గేట్స్ ఒప్పందం కుదుర్చుకుంది. అప్పట్లో ఇద్దరి మధ్య జరిగిన చర్చల సారాంశాన్ని వివరిస్తూ బిల్ గేట్స్ బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను అరుదైన విషయంగా రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. "మీరు ఆశించే ఏఐ డ్రివెన్ డెసిషన్ మేకింగ్, రియల్ టైమ్ సిస్టమ్, హ్యూమన్ కేపిటల్ డెవలప్‌మెంట్ వంటివి మీ నాయకత్వ ప్రతిభను ప్రస్ఫుటం చేస్తున్నాయని. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ సేవల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మీరు చేస్తున్న కృషి ఆంధ్రప్రదేశ్ కే కాదు భారత్ సహా అల్పాదాయ దేశాలకు ఎంతో ఉపయోగపడుతుంది" అంటూ చంద్రబాబుపై ప్రశంసలు కురిపిస్తూ లేఖ రాశారు బిల్ గేట్స్. కొద్దిరోజుల క్రితం ఢిల్లీలో గేట్స్ ఫౌండేషన్ తో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగాన్ని పటిష్ఠపర్చడం, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్, ఏఐ అసిస్టెడ్ క్లినికల్ డెసిషన్ మేకింగ్, మెడ్ టెక్ మాన్యు ఫ్యాక్చరింగ్ హబ్ గా ఏపీని తీర్చిదిద్దడంపై చంద్రబాబుతో జరిగిన చర్చలు ఫలవంతంగా ఉందని గేట్స్ తన లేఖలో ప్రస్తావించారు. పాలనలో టెక్నాలజీ, ఇన్నోవేషనను బలోపేతం చేయడం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు మీరు చూపిన ఆసక్తి, మీ చిత్తశుద్ధి, మీ విజన్ కి నిదర్శనమని బిల్ గేట్స్ ప్రశంసించారు. ఈ సారి తాను ఏపీకి వచ్చేనాటికి చంద్రబాబు నాయకత్వంలో తమ భాగస్వామ్యం అద్భుతమైన పురోగతి సాధిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్-ఏపీ ప్రభుత్వ భాగస్వామ్యం ముమ్ముందు కొనసాగాలని గేట్స్ తన లేఖలో పేర్కొన్నారు.

## పహల్గామ్ దాడి వెనుక కర్త, కర్మ

**(1వపేజీ తరువాయి)**భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కాస్త సద్దుమణుగుతున్న తరుణంలో, జ్యోతి మల్హోత్రా అనే మహిళ వ్యవహారం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. హర్యానాలో పుట్టి, పాకిస్థాన్ గూఢచారిగా మారిన ఆమె కథ వింటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి, తన మాటలతో, అందాలతో లక్షలాది మందిని ఆకర్షించిన జ్యోతి మల్హోత్రా అసలు ముఖం 2023లో పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడే బయటపడింది. అక్కడ ఏజెంట్ డానిష్‌తో పరిచయం ప్రేమగా మారి, చివరకు దేశద్రోహానికి దారితీసింది. యూట్యూబర్ ముసుగులో భారత సైనిక స్థావరాలను చిత్రీకరించి, మన దేశ రహస్యాలను పక్కాగా డానిష్‌కు చేరవేసింది. చివరికి 2024లో హర్యానా-పంజాబ్ సరిహద్దుల్లో సంచరిస్తూ సైనికుల కదలికలను చేరవేస్తుండగా అనుమానం వచ్చి అరెస్టయ్యింది. ఆమె ఫోన్ పరిశీలించగా టెర్రరిస్టులతో సంబంధాలున్నట్లు నిర్ధారణ అయింది. యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆమెకు సంబంధించిన కొన్ని కొత్త కోణాలు పోలీసులు దర్యాప్తులో భాగంగా బయటపెట్టారు. పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి కేవలం రెండు నెలల ముందు, జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌లో పర్యటించినట్లు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు, ఫొటోలు జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్ పర్యటనకు సంబంధించిన వీడియోలు ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. ఒక వీడియోలో మల్హోత్రా లాహోర్‌లోని ఒక రెస్టారెంట్‌లో కొంతమంది వ్యక్తులతో కలిసి భోజనం చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, ఆమెతో పాటు ఉన్న ఆ వ్యక్తులు ఎవరు అనే విషయంపై పోలీసులు ఇంకా స్పష్టతనివ్వలేదు.

## రాజ్‌నాథ్‌ను కలిసిన మదర్సా ఎడ్యుకేషనల్ కౌన్సిల్

**న్యూఢిల్లీ-నవభూమి:** రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఉత్తరాఖండ్ మదర్సా ఎడ్యుకేషనల్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ముఫ్తీ షామూన్ ఖాస్మి మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యావేత్తలు, మేధావులు, సూఫీల ప్రతినిధి బృందం కలిసింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసినందుకు రక్షణ మంత్రిని అభినందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నాయకత్వంలో భారత దళాలు పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలను భారీ దెబ్బకొట్టాయన్నారు. ఈ సాహసోపేతమైన చర్యతో



భారతదేశ వ్యూహం, భద్రతా విధానాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసిస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరవీరులైన సైనికుల కుటుంబాలకు, జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్తాన్ దాడిలో మరణించిన పర్యాటకుల కుటుంబాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ఆయన రక్షణ మంత్రిని కోరారు. ఉత్తరాఖండ్ మదర్సా బోర్డు పాఠ్యాంశాల్లో ఆపరేషన్ సిందూర్‌ను చేర్చాలని ఆలోచిస్తున్నట్లు ముఫ్తీ ఖాస్మీ తెలిపారు. దీని వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటంటే.. మదర్సాల్లో చదువుతున్న విద్యార్థులు దేశ సైనిక విజయాలు, జాతీయ భద్రత గురించి కూడా తెలుసుకోవచ్చునన్నారు.

## 25 మందిని పెళ్లి చేసుకుని మోసం చేసింది.. పోలీసుల ట్రాప్‌కు చిక్కిన లుటేరి దుల్హన్



**జైపూర్-నవభూమి:** అనురాధా పాశ్వాన్ వయసు 32 ఏళ్లు. 25 మందిని పెళ్లి చేసుకుని.. వాళ్లను మోసం చేసిందామె. వారి ఇండ్ల నుంచి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తు కెల్లింది. అనురాధా పాశ్వాన్‌ను లూటింగ్ బ్రైడ్ అని.. లుటేరి దుల్హన్ అని పిలుస్తున్నారు. వధువు పాత్రలో ఘరానా మోసాలకు పాల్పడుతున్న అనరాధను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లే..కొత్త పట్టణానికి వెళ్తే, కొత్త పేరుతో ఆమె పరిచయం చేసుకునేది. పెళ్లికి రెఢీ అంటూ మగవాళ్లను మోసం చేసేది. ఆదర్శమైన వధువుగా నటిస్తూ.. అత్తారింట్లో ముచ్చటైన కోడలి పాత్రను పోషిస్తూ.. అనురాధా పాశ్వాన్ అందర్నీ మోసం చేసేది. ఫేక్ మ్యారేజీలతో ఉడాయిస్తున్న ఆ కిలాడీని సవాయి మాదోపూర్ పోలీసులు పట్టుకున్నారు. రివర్స్ గేమ్ ఆడి ఆమెను అరెస్టు చేశారు. ఒంటరిగా ఉన్నాను.. పేదింటి పిల్లను.. నిస్సహాయురాలిని.. ఉద్యోగం లేని సోదరుడున్నాడు.. పెళ్లి చేసుకోవాలి.. ఆర్థిక ఇబ్బందులున్నాయని చెబూతూ.. వెళ్లిన ప్రతి చోట అనురాధ పరిచయం చేసుకునేది. కానీ ఓ ఫేక్ మ్యారేజీ గ్యాంగ్‌కు ఆమే లీడర్. నమ్మించి మోసం చేయడంలో ఆమె ఎక్స్‌పర్ట్. పెళ్లి కోసం ఎదురుచూస్తున్న వ్యక్తుల వద్దకు ఆమె ఫోటోలను, ప్రొఫైల్‌ను గ్యాంగ్‌లోని సభ్యులే తీసుకెళ్లేవారు. పెళ్లిల బ్రోకర్ కూడా ఆమె గ్యాంగ్‌లో సభ్యుడై ఉంటారు. పెళ్లి కుదురుస్తామని చెప్పి ఆ బ్రోకర్ పాత్ర పోషించిన వ్యక్తి కూడా 2 లక్షలు తీసుకుంటాడు. ఒకవేళ అంతా ఓకే అయితే పెళ్లి ఫిక్స్ చేస్తారు. పెళ్లి ఒప్పందం కుదిరాకా.. గుడిలోనే, ఇంట్లోనో పెళ్లి నిర్వహిస్తారు. సంప్రదాయ, ఆచారాల ప్రకారమే ఆ వేడుక జరుగుతుంది. ఇక ఆ తర్వాతే అసలు గేమ్ మొదలవుతుంది. వరుడితో, అతని ఇంటివాళ్లతో చాలా హుందాగా ప్రవర్తిస్తుందామె. నమ్మకాన్ని గెలుచుకుంటుంది. కుటుంబంలోని ప్రతి వ్యక్తితో ప్రత్యేక అనుబంధాన్ని ఏర్పర్చుకుంటుంది. కొన్ని రోజుల్లోనే తన నిగూఢ ప్లాన్‌ను అమలు చేస్తుంది. ఇంట్లో వాళ్లకు ఆహారంలో మత్తు ఇచ్చి.. బంగారం, నగదుతో పరారీ అవుతుంది. ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నా పట్టుకెళ్తుంది. కిలాడీ అనురాధ జిత్తులకు బాధితుడైన విష్ణు శర్మ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కూపీ లాగారు. సవాయి మాదోపూర్‌కు చెందిన విష్ణుశర్మ హిందూ సంప్రదాయ పద్ధతుల్లో పాశ్వాన్‌ను పెళ్లి చేసుకున్నాడు. బ్రోకర్ పప్పూ మీనా ద్వారా పెళ్లి కుదిరింది. పప్పూ మీనాకు విష్ణు 2 లక్షలు ఇచ్చాడు. పెళ్లి అయిన రెండు వారాల్లోనే ఇంట్లో ఉన్న 1.25 లక్షల విలువైన జువలరీ, 30 వేల నగదు, 30వేల ఖరీదైన ఫోన్‌ను పాశ్వాన్ ఎత్తుకెళ్లింది. లోన్ తీసుకుని పెళ్లి చేసుకున్నానని, కానీ పాశ్వాన్ అలా మోసం చేస్తుందని అనుకోలేదన్నాడు. అనురాధ పరారీ అయిన రోజు తాను ఇంటికి వచ్చి భోజనం చేశానని, ఆ తర్వాత గాఢ నిద్రలోకి వెళ్లిపోయినట్లు చెప్పాడు. విష్ణు శర్మ, అతని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విష్ణు ఇచ్చిన సమాచారం ఆధారంగా సవాయి మాదోపూర్ పోలీసులు ట్రాప్ ప్లాన్ చేశారు. పెళ్లి కొడుకు పాత్రలో ఓ కానిస్టేబుల్ నటించాడు. బ్రోకర్ ద్వారా పాశ్వాన్‌ను పెళ్లికి ఒప్పించి, ఆమెను పట్టుకున్నారు. భూపాల్‌లో ఆమెను అరెస్టు చేశారు.

## జ్యోతి మల్హోత్రాపై ప్రశ్నల వర్షం.. వెలుగులోకి కీలక విషయాలు




**న్యూఢిల్లీ-నవభూమి:** వెల్ వ్లాగర్ జ్యోతి మల్హోత్రా ను అధికారులు శనివారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. జ్యోతి.. 'ట్రావెల్ విత్ జో' పేరుతో యూట్యూబ్ ఛానెల్ నడుపుతోంది. కమిషన్ ఏజెంట్ల ద్వారా వీసా పొందిన జ్యోతి 2023లో పాక్‌ను సందర్శించింది. ఆమె ఎవరికీ అనుమానం రాకుండా పాక్ అధికారులకు సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తేలింది. ఈ కేసులో జ్యోతి మల్హోత్రా ట్రావెల్ వ్లాగర్‌తో కలిసి పని చేస్తున్నట్లు గుర్తించారు. మరో ఐదుగురితో కలిసి ముఠాగా ఏర్పడి హర్యానా, పంజాబ్ నుంచి ఇన్ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మన దేశంలోని కీలక ప్రాంతాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌తో పంచుకున్నట్లు తేలింది. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతి మల్హోత్రాకు సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిసింది.

**ఉగ్రదాడికి ముందు పహల్గాంకు!**

ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె పహల్గాంకు వెళ్లినట్టు తేలింది. అక్కడ తీసిన వీడియోలను పాక్‌లోని ఐఎస్ఐ అధికారులకు ఆమె చేరవేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అలాగే ఉగ్రదాడికి కొన్ని రోజుల ముందు పాకిస్థాన్‌కి కూడా జ్యోతి ప్రయాణించినట్లు హిసర్ పోలీసులు వెల్లడించారు. ఓ పాకిస్థానీ పౌరుడితో తరచూ సంప్రదింపులు జరిపిన జ్యోతి ఐఎస్ఐకి అస్త్రంగా మారిపోయిందని హిసర్ ఎస్పీ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు.

## 4 లేదా 5 రోజుల్లో కేరళకు నైరుతి: ఐఎండీ



**న్యూఢిల్లీ-నవభూమి:** నైరుతి రాకపై ఐఎండీ ఇవాళ మరో అప్‌డేట్ ఇచ్చింది. రానున్న 4 లేదా 5 రోజుల్లో.. నైరుతి రుతుపవనాలు కేరళను తాకనున్నట్లు భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ ఒకటో తేదీన నైరుతి రుతుపవనాలు కేరళను తాకుతాయి. ఇక ఈ యేడాది మే 27వ తేదీ వరకు నైరుతి కేరళ చేరనున్నట్లు కొన్ని రోజుల క్రితం ఐఎండీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఒకవేళ అనుకున్నట్లు నైరుతి కేరళకు వస్తే, 2009 తర్వాత కేరళకు నైరుతి చాలా ముందుగా వచ్చినట్లు భావిస్తున్నారు. రాబోయే 4, 5 రోజుల్లో కేరళను నైరుతి తాకే సందర్భాలు అనుకూలంగా ఉన్నట్లు ఇవాళ

## పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌కు ప్రమోషన్ వేళ.. భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ పదవీకాలం పొడగింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌తో ఉద్రిక్తతల వేళ పాకిస్తాన్ కీలక నిర్ణయం తీసుకుంది. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా కల్పిస్తూ పాక్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఇలాంటి సమయంలోనే భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ తపన్ కుమార్ డేకా పదవీకాలాన్ని మరోసారి పొడిగించారు. దీంతో ఆయన మరో ఏడాది కాలం పాటు బ్యూరో చీఫ్ పదవిలో కొనసాగనున్నారు. తపన్ కుమార్ డేకా పదవీకాలాన్ని మరో సంవత్సరం పాటు పొడిగించేందుకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ తాజాగా ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ చేసింది. జూన్ 2026 లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు తపన్ కుమార్ డేకా ఈ పదవిలో కొనసాగనున్నారు. హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు చెందిన డేకా 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఆయన గతంలో రెండు దశాబ్దాల పాటు ఐబీ ఆపరేషన్స్ విభాగానికి చీఫ్‌గా కూడా పని చేశారు. 2008 ముంబై 26/11 ఉగ్రదాడి సమయంలో కౌంటర్ ఆపరేషన్‌కు తపన్ కుమార్ డేకానే బాధ్యత వహించారు. 2000లో దేశంలో అనేక ఉగ్రవాద దాడులకు కారణమైన ఇండియన్ ముజాహిదీన్‌పై కార్యకలాపాలకు కూడా నాయకత్వం వహించారు. డేకాకు ఈశాన్య ప్రాంతంతో పాటు తన సొంత రాష్ట్రమైన అస్సాంలోని పరిస్థితులను నేర్పుగా నిర్వహించడంలో అపార అనుభవం ఉంది.

జమ్మూ కశ్మీర్‌లో సంక్షోభాలను పరిష్కరించడంలో తపన్ కుమార్ డేకా ప్రభుత్వం తరఫున ముఖ్య అధికారిగా పని చేస్తున్నారు. అందుకే ఆయన సేవలను మరికొన్ని రోజులు పొడిగిస్తున్నట్లు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ పేర్కొంది. ముఖ్యంగా ఈయనకు ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కేసులను సమర్థంగా పరిష్కరిస్తారన్న పేరు ఉంది. ఉగ్రవాద నిరోధక నిపుణుడిగా ఆయనను పిలుస్తుంటారు. పాకిస్థాన్ మూలాలు కలిగిన ఉగ్రవాద నిరోధక కేసులను నిర్వహించడంలో ఆయన నిపుణుడు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో ఈయన చాలా కీలకంగా వ్యవహరించారు. నిఘా సమాచారాన్ని సేకరించడంలో తపన్ కుమార్ డేకా అత్యంత ప్రావీణ్యం కలవారు. తపన్ కుమార్ డేకా జూన్ 2022లో రెండేళ్ల కాలానికి ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ పదవిలో నియమితులయ్యారు. జూన్ 2024లో ఆయన పదవీకాలం ముగుస్తుందనగా, మరో సంవత్సరం పాటు ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. ఇప్పుడు మరోసారి ఆయన పదవీకాలాన్ని పొడిగించింది కేంద్ర సర్కారు. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్, 1958లోని = 56(ఎ%), రూల్ 16 నిబంధనలను సడలించి ఆయనను ఈ పదవిలో కొనసాగిస్తున్నారు. ప్రజా ప్రయోజనార్థం ఇంటెలిజెన్స్ బ్యూరో అలాగే రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ అధిపతులను, క్యాబినెట్ సెక్రటరీ, హోం సెక్రటరీ, ఇతరుల పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాలు దాటినప్పటికీ ఈ నిబంధనల ద్వారా వారి సేవలను పొడిగించవచ్చు.

## పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌కు అత్యున్నత గౌరవం..



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ప్రతిష్టాత్మకమైన ఫీల్డ్ మార్షల్ ర్యాంకును కల్పించే ప్రతిపాదనకు ఆ దేశ మంత్రివర్గం మంగళవారం ఆమోద ముద్ర కల్పించింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్-పాకిస్తాన్ మధ్య ఇటీవల సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తీవ్రమై.. దాడులు జరిగిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణలో జనరల్ అసిమ్ మునీర్ చూపిన అసాధారణ పాత్రకు గుర్తింపుగా ఈ పదోన్నతి కల్పిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రభుత్వ రంగ టెలివిజన్ ఛానల్ పీటీవీ తెలిపింది. పాకిస్తాన్ శాంతిని కోరుకుంటుందని.. అయితే తమ దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘిస్తే.. తమ జాతీయ ప్రతిష్టను, ప్రజల శ్రేయస్సును కాపాడుకోవడానికి పూర్తి బలంతో స్పందిస్తామని మే 5వ తేదీన రావల్పిండిలో అసిమ్ మునీర్ చేసిన వ్యాఖ్యలను జియో టీవీ ఉటంకించింది. ఇక్కడివరకు బాగానే ఉన్నా ఇప్పుడు పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్ హోదా ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్‌ను.. పాక్ ఆర్మీ చీఫ్ నేరుగా పాకిస్తాన్‌లోని 3 ప్రధాన సాయుధ దళాలకు ముగ్గురు అధిపతులు ఉంటారు. అసిమ్ మునీర్ కేవలం పాకిస్తాన్ ఆర్మీకి మాత్రమే చీఫ్‌గా వ్యవహరిస్తారు. పాకిస్తాన్ వైమానిక దళానికి అధిపతిగా ఎయిర్ చీఫ్ స్టాఫ్.. పాకిస్తాన్ నేవీకి చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ అధిపతిగా ఉంటారు. అయితే ఈ ముగ్గురు చీఫ్‌లు.. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీకి ఛైర్మన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీజేసీఎస్‌సీ) నాయకత్వం వహిస్తారు. ఈ సీజేసీఎస్‌సీ త్రివిధ దళాలను సమన్వయ పరుస్తూ.. పాకిస్తాన్ ప్రభుత్వానికి ప్రధాన సైనిక సలహాదారుగా వ్యవహరిస్తారు.

అయితే పాక్ ఆర్మీ చీఫ్.. తన సైన్యాన్ని పర్యవేక్షించినట్లుగా.. ఎయిర్‌ఫోర్స్‌ను నేరుగా పర్యవేక్షించరు. ఇటీవల భారత్-పాకిస్తాన్ ఉద్రిక్తతల వేళ.. తాము గెలిచేశామని ఆ దేశం గొప్పలు చెప్పుకుంది. అంతటితో ఆగకుండా విజయోత్సవ ర్యాలీలు కూడా తీసి.. ప్రపంచం ముందు నవ్వులపాలైంది. భారీగా సైనిక, ఆస్తి, ఆయుధ నష్టం జరిగినా.. వాటిని కప్పిపుచ్చుకునేందుకు పాకిస్తాన్ ఇలాంటి ర్యాలీలు తీసిందని ప్రపంచ దేశాలకు అర్థమైంది. అయితే భారత్‌పై దాడులు చేసి విజయం సాధించామని చెప్పడం కంటే ముందు.. అసలు ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ చేసిన దాడులను కనీసం అడ్డుకోవడానికి కూడా పాకిస్తాన్ చేసిన ఏ ప్రయత్నం ఫలించలేదు. ఇక భారత్ చేసిన దాడులను అడ్డుకునేందుకు అంతో ఇంతో పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ ప్రయత్నాలు చేసింది. భారత్ చేసిన దాడుల్లో అడ్డుకోవడంలో గానీ.. తిరిగి దాడి చేయడంలో గానీ పాకిస్తాన్ ఆర్మీ పాత్ర లేనే లేదు అనేది అందరికీ తెలిసిందే. అయినప్పటికీ పాక్ ఆర్మీ చీఫ్‌గా ఉన్న అసిమ్ మునీర్‌కు ఇలాంటి ఫీల్డ్ మార్షల్ హోదా కల్పించి ఇప్పుడు మళ్లీ ప్రపంచ దేశాల ముందు పాకిస్తాన్ జోకర్‌గా మారింది. ఫీల్డ్ మార్షల్ అనేది సైన్యంలో అత్యున్నత సైనిక హోదా. సాధారణంగా అసాధారణమైన సైనిక విజయాలు.. యుద్ధంలో నిర్ణయాత్మక విజయం సాధించినప్పుడు గౌరవప్రదంగా చీఫ్‌లకు ఈ ఫీల్డ్ మార్షల్ హోదా ఇస్తారు. ఈ ఫీల్డ్ మార్షల్ అపారమైన ప్రతిష్ట, గౌరవాన్ని కలిగి ఉంటుంది. దేశానికి జీవితకాలం చేసిన విశిష్ట సేవకు గుర్తుగా దీన్ని ప్రదానం చేస్తారు. నేవీలో ఫీల్డ్ మార్షల్‌కు సమానమైన హోదా ఫ్లీట్ అడ్మిరల్ కాగా.. ఎయిర్‌ఫోర్స్‌లో మార్షల్ ఆఫ్ ది ఎయిర్ ఫోర్స్ ప్రదానం చేస్తారు. ఫీల్డ్ మార్షల్ అనే పదం మధ్యయుగ కాలం నుంచి వచ్చింది.

**భారత్‌లో ఫీల్డ్ మార్షల్**

భారత సైన్యంలో ఫీల్డ్ మార్షల్ అనేది అత్యున్నత హోదా. ఇది ఫైవ్ స్టార్ ర్యాంకు. ఈ హోదా ఎంతో గౌరవప్రదమైంది. ఈ ఫీల్డ్ మార్షల్ ర్యాంకు పొందిన వారు మరణించే వరకు కూడా దేశానికి సేవలు అందిస్తున్న అధికారులుగానే పరిగణిస్తారు. ఇప్పటివరకు కేవలం ఇద్దరు భారత సైనిక అధికారులు మాత్రమే ఈ ఫీల్డ్ మార్షల్ ర్యాంకును పొందారు. 1971 ఇండో-పాక్ యుద్ధంలో గెలిచిన తర్వాత.. అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న ఇందిరా గాంధీ.. జనరల్ సామ్ మానెక్‌షాకు ఫీల్డ్ మార్షల్ ర్యాంకు ఇచ్చారు. ఆ యుద్ధంలో భారత సైన్యానికి నాయకత్వం వహించి.. విజయం సాధించిన జనరల్ సామ్ మానెక్‌షాకు 1973 జనవరి 1వ తేదీన ఫీల్డ్ మార్షల్ ర్యాంకును ప్రదానం చేశారు. దీంతో ఇండియన్ ఆర్మీలో మొట్టమొదటి ఫీల్డ్ మార్షల్‌గా ఆయన నిలిచారు. ఇక మన దేశంలో రెండో ఫీల్డ్ మార్షల్ ర్యాంకును దక్కించుకున్న వ్యక్తి జనరల్ కేఎం కరియప్ప. 1986లో జనరల్ కేఎం కరియప్పకు ఈ గౌరవం దక్కింది.

## దేశంలో తొలి బుల్లెట్ రైలు పనుల్లో కీలక మైలురాయి



**ముంబై-నవభూమి:** దేశంలో తొలి బుల్లెట్ రైలు పనుల్లో కీలకఘట్టం ఆవిష్కృతమైంది. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులపై రైల్వే మంత్రి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఏంటంటే.. ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైలు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా కీలకఘట్టం పూర్తయింది. బుల్లెట్ రైలు దూసుకెళ్లే 300 కిలోమీటర్ల వయాడక్ట్ (రైల్వే వంతెన) పనులు పూర్తయ్యాయి. ఈ మేరకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక వీడియోను షేర్ చేశారు.

దేశంలోనే తొలి బుల్లెట్ రైలు ముంబై-అహ్మదాబాద్ మధ్య పరుగులు పెట్టనున్న విషయం తెలిసిందే. ఈ రైలు కారిడార్ పొడవు 508.17 కిలోమీటర్లు. ఒకసారి ఈ రైలు సేవలు అందుబాటులోకి వచ్చాక అహ్మదాబాద్ నుంచి ముంబై కేవలం 2.58 గంటల్లో చేరుకోవచ్చు. ఈ రైల్వే లైనులో మొత్తంగా 12 స్టేషన్లు ఉండనున్నాయి. గుజరాత్‌లో 8 స్టేషన్లు ఉండగా.. మహారాష్ట్రలో 4 స్టేషన్లు ఉంటాయి. 508.17 కిలోమీటర్ల రైలు మార్గంలో దాదాపు 21 కిలోమీటర్లు భూగర్భంలోనే ఉంటుంది. బుల్లెట్ ట్రైన్ రాకపోకలు సాగించే ముంబై స్టేషన్ పూర్తిగా అండర్ గ్రౌండ్‌లోనే ఉంటుంది. ది నేషనల్ హై-స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు బాధ్యతలను నిర్వహిస్తోంది. 257.4 కిలోమీటర్లు ఫుల్ స్పాన్ లాంచిగ్ విధానంలో 14 రివర్ బ్రిడ్జిలు స్పాన్ బై స్పాన్ పద్ధతిలో నిర్మిస్తున్నట్లు ది నేషనల్ హై-స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ తెలిపింది. ఈ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం 401 కిలోమీటర్ల ఫౌండేషన్ పనులు జరిగాయి. బుల్లెట్ ట్రైన్ తొలి ట్రయల్స్‌ను 2026లో చేపట్టనున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ట్రయల్ రన్‌లో భాగంగా బుల్లెట్ రైలు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగులు పెడుతుందని చెబుతున్నారు. ఇది విమానం టేకాఫ్ అయ్యే వేగంతో సమానమని తెలిపారు. అయితే, ఈ బుల్లెట్ రైలు ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తర్వాత గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతోనే నడవనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పనులు 2028 నాటికి పూర్తి అవుతాయని అధికారులు చెబుతున్నారు.

## కైలాస్-మానస సరోవర్ యాత్ర మార్గంలో

# విరిగిపడ్డ కొండచరియలు



**న్యూఢిల్లీ-నవభూమి:** కైలాస్-మానస సరోవర్ యాత్ర మార్గంలో విరిగిపడ్డ కొండచరియలు.. చిక్కుకుపోయిన వందలాది మంది యాత్రికులు (ఫోటోలు- ఉత్తరాఖండ్‌లోని పితోరాగఢ్ జిల్లాలో నేడు కొండ చరియలు విరిగి పడ్డాయి. ముఖ్యంగా కైలాస్-మానస్ సరోవర్ యాత్ర మార్గంలో ఒక్కసారిగా కొండ చరియలు విరిగి పడగా.. వందలాది మంది యాత్రికులు అక్కడే చిక్కుకుపోయారు. వీరితో పాటే స్థానికులు కూడా అక్కడే ఉండిపోగా.. అధికారులు అప్రమత్తం అయ్యారు. రోడ్లపై పడిపోయిన శిథిలాలను తొలగించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ బృందాన్ని రంగంలోకి దింపగా.. సహాయక చర్యలను కొనసాగిస్తోంది. అయితే అదృష్టవశాత్తు ఈ ప్రమాదం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని స్థానిక అధికారులు వివరించారు.

ఉత్తరాఖండ్‌లోని కైలాస్-మానస సరోవర్ యాత్ర గత ఐదు సంవత్సరాలు నిలిచిపోయింది. ముఖ్యంగా 2020లో కరోనా కారణంగా కైలాస పర్వతం, మానస సరోవర్ సరస్సు యాత్రను అప్పట్లో నిలిపివేశారు. ఆ తర్వాత రెండేళ్లకు కరోనా తగ్గిపోయినప్పటికీ.. గల్వాన్ ఘర్షణలు తలెత్తాయి. ముఖ్యంగా భారత్, చైనా దేశాల మధ్య సంబంధాలు దెబ్బతినగా.. ఈ యాత్ర నిలిపివేతను అలాగే కొనసాగించారు. అయితే 2024లో రష్యా అధ్యక్షుడు చొరవ తీసుకుని.. చైనా, భారత్ దేశాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పాలని చూశారు. అందుకే ఇటు ప్రధాని మోదీని, అటు చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్‌లను తమ దేశానికి పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఇలా రెండు దేశాల మధ్య పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాయి.

## పూంచ్‌లో పాక్ లైవ్ షెల్.. ధ్వంసం చేసిన భారత ఆర్మీ



**న్యూఢిల్లీ-నవభూమి:** సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ జమ్ము కశ్మీర్‌లో పాక్ ప్రయోగించిన ఓ లైవ్ షెల్ బయటపడింది. రోడ్డు పక్కన ఈ షెల్‌ను గుర్తించిన స్థానికులు.. అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న భారత ఆర్మీ పాక్ షెల్‌ను విజయవంతంగా ధ్వంసం చేసింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడులను జీర్ణించుకోలేని పాక్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. భారత సరిహద్దు గ్రామాలపై దాడులకు పాల్పడింది. ముఖ్యంగా జమ్ము కశ్మీర్ సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్లు, బాంబ్ షెల్స్‌ను ప్రయోగించింది. అప్రమత్తమైన సైన్యం సరిహద్దు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించింది. అయితే, ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో ప్రజలు తమ గ్రామాలకు చేరుకున్నారు. ఈ క్రమంలో పూంచ్ వద్ద రోడ్డు పక్కన పాక్ ప్రయోగించిన లైవ్ షెల్‌ను గుర్తించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన భద్రతా దళాలు దాన్ని పేల్చేశాయి. పాక్ చర్యలకు పూంచ్ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభావితమయ్యారు. అక్కడ 25 మంది ప్రాణాలు కోల్పోయారు.

## మహారాష్ట్రలో కోరలు చాస్తున్న కరోనా.. వారం రోజుల్లోనే భారీగా పెరిగిన పాజిటివ్ కేసులు



**ముంబై-నవభూమి:** నాలుగేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి ఇప్పుడు మళ్లీ విజృంభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. సింగపూర్, హాంకాంగ్, చైనా, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉంది. ఇక భారత్‌లోనూ 257 యాక్టివ్ కేసులు ఉన్నాయి. అయినప్పటికీ దేశంలో కొవిడ్ పరిస్థితి నియంత్రణలో ఉందని, ఆందోళన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. కాగా, మహారాష్ట్రలో కరోనా వైరస్ యాక్టివ్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే పాజిటివ్ కేసుల సంఖ్య 12 నుంచి 56కి పెరిగింది. అంతేకాదు మరణాలు కూడా నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కొవిడ్ నివారణ చర్యలు తీసుకుంటున్నారు. ఇక దేశంలో అత్యధికంగా కేరళలో 95 కొవిడ్ పాజిటివ్ కేసులు ఉన్నాయి.


**దేశంలో 257 కొవిడ్ కేసులు**

సింగపూర్, హాంకాంగ్‌లలో కొవిడ్ కేసులు పెరుగుతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) సమీక్షా సమావేశం నిర్వహించింది. మన దేశంలో ప్రస్తుతం 257 కొవిడ్ కేసులు నమోదైనట్లు తెలిపింది. ఇవి స్వల్ప లక్షణాలు గల కేసులని, వ్యాధిగ్రస్థులను దవాఖానలలో చేర్పించి, చికిత్స చేయవలసిన అవసరం లేదని వివరించింది. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ డివిజన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, సెంట్రల్ గవర్నమెంట్ హాస్పిటల్స్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

## 10, 12 తరగతుల రీవాల్యుయేషన్, రీ-వెరిఫికేషన్ తేదీలు ఇవే..

**న్యూఢిల్లీ-నవభూమి:** 10, 12వ తరగతి ఫలితాలను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. తమ మార్కులతో సంతృప్తిగా లేనివాళ్లు %జదీూజు% అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 10, 12వ తరగతి విద్యార్థుల ఫలితాలను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా.. రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ షెడ్యూల్‌ను బోర్డు ప్రకటించింది. ఫెయిల్ అయిన విద్యార్థులు, తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు వారు కోరుకున్న సబ్జెక్టును వెరిఫికేషన్ లేదా రీ వాల్యుయేషన్, లేదా రెండింటికీ కూడా అప్లై చేసుకోవచ్చు. ప్రకటించిన నోటీసు ప్రకారం, 12వ తరగతి విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్ట్ స్కాన్ కాపీలను పొందడానికి మే 21 నుండి మే 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో సబ్జెక్టు రూ. 700 ఉంటుంది. అలాగే, 10వ తరగతి విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్ట్ స్కాన్ కాపీలను పొందడానికి మే 25 నుండి జూన్ 2 వరకు అప్లై చేసుకోవచ్చు. ఒక్కో సబ్జెక్టుకు రూ. 500 చెల్లించాలి. 12వ తరగతి విద్యార్థులు మే 28 నుండి జూన్ 6 వరకు మార్కుల రీ-వాల్యుయేషన్, రీ-వెరిఫికేషన్‌కు అప్లై చేసుకోవచ్చు. వెరిఫికేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టు రూ. 500, రీ-వాల్యుయేషన్‌కు ఒక్కో ప్రశ్నకు రూ. 100 ఖర్చవుతుంది.



## సరికొత్త టెక్నాలజీతో బుల్లెట్ ట్రైన్ బ్రిడ్జి నిర్మాణం..



**ముంబై-నవభూమి:** ముంబై టు అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు జెట్ స్పీడుతో సాగుతున్నాయి. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు సంబంధించి 300 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు తన ట్విటర్ ఖాతాలో బ్రిడ్జి పనులకు సంబంధించిన వీడియోను షేర్ చేశారు. 300 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని వెల్లడించారు. ఈ బ్రిడ్జిని ఫుల్ స్పాన్ లాంచింగ్ పద్ధతి ద్వారా నిర్మించినట్లు తెలిపారు.కాగా, ది నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పోరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. మొత్తం 508 కిలోమీటర్ల పొడవుతో బుల్లెట్ ట్రైన్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఇందులో 300 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మాణం తాజాగా పూర్తయింది. ఈ 300 కిలోమీటర్ల బ్రిడ్జిలో.. 257.4 కిలోమీటర్లు ఫుల్ స్పాన్ లాంచింగ్ పద్ధతి ద్వారా నిర్మించారు. ఈ పద్ధతి సాధారణ పద్ధతి కంటే పది రెట్లు వేగంగా పనుల్ని పూర్తి చేస్తుంది. ఈ పద్ధతి ఉపయోగించి బ్రిడ్జిని నిర్మించటం ఇండియాలో ఇదే మొదటి సారి. ఇక, కేంద్ర మంత్రి విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.లక్ష కోట్లతో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్..ముంబై, అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్ట్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నాయి. మొత్తం 1.08 లక్షల కోట్లతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం తమ వాటాగా పది వేల కోట్లను ఇవ్వనుంది. గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు 5 వేల కోట్ల చొప్పున ఇవ్వనున్నాయి.

## ట్రంప్ దౌత్య రాజకీయం

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత వ్యవహారాలలో ప్రమేయం పెట్టుకోకుండా దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారు. అయితే ట్రంప్ మహాశయుడు మోదీ అభీష్టాన్ని నెరవేరుస్తారా? నెరవేర్చరు, సందేహం లేదు. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలో ఉగ్రవాద దాడితో ప్రారంభమైన ఇండియా%-%పాకిస్థాన్ సంఘర్షణలో అమెరికా ప్రమేయం పెట్టుకుని తీరాలని డోనాల్డ్ ట్రంప్ విశ్వసిస్తున్నారు. ఈ ఘర్షణపై తాను మాట్లాడిన ప్రతిసారీ, ట్వీట్ చేసిన ప్రతిసారీ తానూ భాగస్తుడినని మరీ మరీ స్పష్టం చేస్తున్నారు. ట్రంప్ అత్యుత్సాహానికి మౌనమే ఇంతవరకూ మోదీ ప్రతిస్పందన. సెప్టెంబర్ 2019లో హ్యూస్టన్‌లో 'అబ్కీ బార్, ట్రంప్ సర్కార్' అని పిలుపు ఇచ్చినందుకు మోదీ ఇప్పుడు కలవరపడుతూ ఉండవచ్చని నేను అనుమానిస్తున్నాను. ఏప్రిల్ 22న, ఇతర ప్రపంచ నాయకుల వలే ట్రంప్ కూడా పహల్గాం ఘాతుకంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఘటనను తీవ్రంగా ఖండించారు. మే 7న పాకిస్థాన్‌లో ఎంపిక చేసిన లక్ష్యాలపై భారత్ మిస్సైళ్ల, డ్రోన్‌ల దాడి ప్రారంభించింది. పూర్తి స్థాయి యుద్ధానికి దిగే ఉద్దేశం తమకు లేదని ఇండియా స్పష్టం చేసింది. భారత్ పాకిస్థాన్‌ల మధ్య సాయుధ ఘర్షణ శీఘ్రగతిన ముగుస్తుందని ఆశిస్తున్నానని ట్రంప్ ట్వీట్ చేశారు. ఆ మరుసటి రోజు 'తాను ఏమైనా సహాయం చేయగలుగుతానని భావిస్తే అక్కడ ఉంటాను' అని ఆయన అన్నారు. మే 8/9 రాత్రి ఆయన వైఖరిలో ఏదో మార్పు చోటుచేసుకున్నది. చైనా ఉత్పత్తి చేసిన యుద్ధ విమానాలు, మిస్సైళ్లు, టర్కీలో తయారైన డ్రోన్స్‌ను పాకిస్థాన్ ఉపయోగిస్తున్న విషయం తెలియడం వల్లే ఆ మార్పు సంభవించి ఉంటుందని నేను భావిస్తున్నాను.పాకిస్థాన్ ప్రయోగించిన మిస్సైళ్లు, డ్రోన్‌లు అన్నిటినీ కూల్చివేసినట్టు మన సీనియర్ సైనికాధికారులు ధ్రువీకరించారు. రెండు రోజుల అనంతరం భారత్‌కు కొంత 'నష్టం' సంభవించినట్టు అధికారికంగా అంగీకరించారు. యుద్ధంలో రెండుపక్షాలకు నష్టం వాటిల్లడం సహజమే కదా. జరిగిన నష్టానికి ఇండియా ఏమీ ఆందోళన చెందలేదు. భారత ప్రజలూ కలవరపడలేదు. మే 10న ట్రంప్ తన వ్యక్తిగత సామాజిక మాధ్యమ వేదిక 'ట్రూత్ సోషల్'లో చేసిన ట్వీట్‌తో కలవరం మొదలయింది. ఆ రోజు సాయంత్రం 5.25 గంటలకు ట్రంప్ తన ట్వీట్‌లో అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా జరిగిన చర్చల గురించి ప్రస్తావిస్తూ భారత్, పాకిస్థాన్‌లు తక్షణమే, పూర్తి స్థాయిలో కాల్పుల విరమణ పాటించేందుకు అంగీకరించాయని ప్రకటించేందుకు సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇరు దేశాలను అభినందించారు. కొద్ది నిమిషాల అనంతరం అమెరికా విదేశాంగ కార్యదర్శి ఒక 'తటస్థ' ప్రదేశంలో చర్చలకు భారత్, పాకిస్థాన్‌లు సమావేశమవనున్నాయని ట్వీట్ చేశారు. అంతకు ముందు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు వ్యాన్స్ మోదీతో టెలిఫోన్‌లో జరిపిన సంభాషణల్లో ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని తెలియజేసినట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి.ఈ ట్వీట్‌లు అన్నీ ఆసక్తికరంగానూ, దిగ్భ్రాంతికరంగాను ఉన్నాయి. మే 10 మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్ డీజీఎమ్‌ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్)ల మధ్య చర్చలు జరిగాయని, సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ పాటించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని అదే రోజు సాయంత్రం 6 గంటలకు భారత విదేశాంగ శాఖ కార్యదర్శి ధ్రువీకరించారు. మే 12న 'అణు యుద్ధ' ప్రమాదాన్ని నివారించామని ట్రంప్ పేర్కొన్నారు. 'ఆ భయంకర యుద్ధానికి పాల్పడవద్దు. మీరు సంయమనంతో వ్యవహరిస్తేనే మీతో మేము వాణిజ్యం చేస్తామ'ని ఆయన అన్నారు. 'మీరు గనుక యుద్ధాన్ని ఆపకపోతే మేము ఎటువంటి వాణిజ్యమూ చేయం' అని ఆయన పేర్కొన్నారు. (సౌదీ అరేబియా, ఖతర్ పర్యటనలలో కూడా అధ్యక్షుడు ట్రంప్ తన ప్రకటనలను పునరుద్ఘాటించారు). మే 13న 'కొత్త సాధారణ పరిస్థితి' గురించి మోదీ ప్రస్తావించారు. 'అణు బ్లాక్ మెయిల్'కు తాము భయపడమని, తలొగ్గమని స్పష్టం చేశారు. కొన్ని సహేతుకమైన ప్రశ్నలు: మూడు అంశాల సూత్రంలో 'కొత్త' విషయమేమీ లేదు.ఉగ్రవాద దాడికి దీటుగా ప్రతిస్పందించడంబీ అణు బ్లాక్‌మెయిల్‌ను సహించకపోవడంబీ రాజ్య ఉగ్రవాదం, ఉగ్రదాడుల వ్యూహ ప్రజ్ఞాధురీణుల మధ్య వ్యత్యాసాన్ని పాటించకపోవడం. ఈ సువ్యవస్థిత సిద్ధాంతాన్నే కదా మోదీ పునరుద్ఘాటించింది? (2) ఉపాధ్యక్షుడు వ్యాన్స్, విదేశాంగ కార్యదర్శి రూబియో మే 8, 9న కాల్పుల విరమణ గురించి మాట్లాడారా? అదే సమయంలో వారు పాకిస్థాన్ నేతలతో కూడా మాట్లాడారా? మాట్లాడి ఉన్నట్టయితే అది మధ్యవర్తిత్వం కిందకు వస్తుంది కదా. (3) మే 9న మోదీతో 'ఆందోళనకరమైన గూఢచార సమాచారాన్ని' ఉపాధ్యక్షుడు వ్యాన్స్ పంచుకున్నారా? అణ్వస్త్రాలను ప్రయోగిస్తామన్న పాకిస్థాన్ బెదిరింపునకు సంబంధించినదేనా ఆ సమాచారం? కానట్టయితే ప్రధానమంత్రి (మే 12), రక్షణ మంత్రి (మే 15) అణు బ్లాక్‌మెయిల్ గురించి ఎందుకు ప్రస్తావించారు? (4) మే 10న మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్, పాకిస్థాన్‌ల డీజీఎమ్‌ఓలు కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చినట్టు ట్రంప్‌కు ఎలా తెలిసింది? ఆ విషయాన్ని అదే రోజు సాయంత్రం 5.25 గంటలకు తన ట్వీట్‌లో ఆయన ఎలా ప్రకటించారు? (5) ట్రంప్ ఏప్రిల్ 2న సుంకాల సమరాన్ని ప్రారంభించిన తరువాత భారత్ మారు ప్రతిపాదనలు పంపలేదా? ఉపాధ్యక్షుడు వ్యాన్స్ తన ఇండియా పర్యటనలో మోదీతో జరిపిన సంభాషణల్లో 'వాణిజ్య ఒప్పందం' విషయాన్ని ప్రస్తావించిందా? (6) భారత్, పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం చేశామని, వాణిజ్యం అంశాన్ని ఉపయోగించుకుని కాల్పుల విరమణ పాటించేలా బలవంతం చేశామని ట్రంప్ పదే పదే చెప్పుతుండడంపట్ల అమెరికాకు ఇండియా నిరసన తెలిపిందా? పాకిస్థాన్‌కు ఐఎమ్‌ఎఫ్ రుణం మంజూరుకు సంబంధించిన సమావేశానికి ఇండియా ఎందుకు గైర్హాజరయింది? ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎందుకు ఓటు వేయలేదు? ఇంకా వివిధ ప్రశ్నలు ఉన్నాయి. అయితే వాటిని ప్రస్తావించేందుకు తగిన సమయం ఆసన్నమవలేదు. డోనాల్డ్ ట్రంప్ ఎవరికీ లొంగే వ్యక్తి కాదు. భారత్, పాకిస్థాన్ ఘర్షణ వ్యవహారాలకు ఆయన దూరంగా ఉండరు, ఉండబోరు. ఇబ్బంది కలిగించే ప్రకటనలు చేస్తూనే ఉంటారు. ఇంకా అనేక ప్రశ్నలకు ఆస్కారమిచ్చే విపుల సమాచారాన్ని ఆయన తప్పకుండా ఇస్తారు. అది లేవనెత్తే ప్రశ్నలు అన్నిటికీ మనకు సమాధానాలు లభిస్తాయా? లేక మౌనమే సమాధానమా?

# 'సైద్ధాంతిక స్పష్టత'వామపక్షాలకు గీటురాయి





వర్గ పోరాట సంఘర్షణ నేపథ్యంగా కొనసాగుతున్న ఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో నేడు సైద్ధాంతిక స్పష్టతలు లోపిస్తూనే ఉన్నాయి. తత్ఫలితంగా ఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో అనేక దుందుకుడు ధోరణులు చాలా ప్రస్ఫుటంగా పొడచూపుతూన్తే ఉన్నాయి అని చెప్పడంలోఏమాత్రం సందేహం లేదు. కమ్యూనిస్ట్ పార్టీలలో అనేక చీలికలు - పేలికలే వాటికి నిదర్శనంగానిలుస్తున్నాయి అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. అందువలన ఆయా కమ్యూనిస్ట్ పార్టీలుసైద్ధాంతిక స్పష్టతాలకు తప్పనిసగా పెద్దపీట వేసి తమ లక్ష్యాలకు అనుగుణంగాఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.సోవియట్ యూనియన్ లోనూ మరియు తూర్పు యూరప్ లోనూ సోషలిజం పతనంచెందిననూ నేటికిని అనేక దేశాలలో సోషలిజం స్ఫూర్తి సజీవంగా కొనసాగుతూనే ఉంది. లాటిన్‌అమెరికా దేశాలలో ఆయా కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టత విషయంలో పూర్తి స్పష్టతనుకలిగి ఆ దిశగా గమనం సాగిస్తూ ఉండడమే కాకుండా విజయపథంలో అప్రతిహతంగాదూసుకుపోతూనే ఉండడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కాని కొన్ని దేశాలలోని ఆయాకమ్యూనిస్ట్ పార్టీలలో సైద్ధాంతిక స్పష్టతలు కొరవడినట్లుగా స్పష్టంగా వెల్లడవుతూనే ఉంది.

భారతదేశం లోని అనేక కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టత విషయంలో వెనకడుగువేస్తున్నటుగానే కనిపిస్తుంది అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. కమ్యూనిస్ట్ పార్టీలు అనేకచీలికలకు గురికావడం సమసమాజ స్థాపనకు గుదిబండగా మారాయి అని చెప్పడంలో

ఏమాత్రం సందేహం లేదు. పపంచ కార్మికుల్లారా ఏకం కండి. పోరాడితే పోయేదేమీ లేదు' అనిగొంతు చించుకునే కమ్యూనిస్టులు తాము మాత్రం చీలికలు - పేలికలుగా విడిపోవడం భారతకమ్యూనిస్ట్ ఉద్యమంలో అత్యంత విషాదకరంగా నిలుస్తుంది అని చెప్పవచ్చు. అదేకమ్యూనిస్టులు మళ్ళీ 'వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి' అనే గొంతు చించుకుంటూ ఆ దిశగాకనీసం అడుగులు కూడా వేయకుండా కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితంకావడం కమ్యూనిస్టుల తిరోగమనాన్ని వెల్లడిస్తుంది అని చాలా స్పష్టంగా చెప్పకనేచెప్పవచ్చు. ఈ మధ్య కాలంలో కొన్ని కమ్యూనిస్ట్ పార్టీలు చీలిపోవడం, అదే విధంగా మళ్ళీ

ఐక్యం కావడం అనే అపసవ్య ధోరణులు పరిపాటిగా మారుతుండటం విచారకరం. అందువలనఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో స్పష్టమైన సైద్ధాంతిక స్పష్టతలు కొరవడటం మూలంగానే ఇలాంటివిపత్కర ధోరణులు సంభవిస్తున్నాయి అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టతని విస్మరించి ఎన్నికలలో బూర్జువా పార్టీలతోఅవకాశవాద ఎత్తులు - పొత్తులు కొనసాగించడం మూలంగా సొంత క్యాడర్ సైతం వ్యతిరేకతనిప్రదర్శిస్తుండడాన్ని అనేక సందర్భాలలో చాలా స్పష్టంగా గమనించవచ్చు.


భారతదేశంలోకమ్యూనిస్ట్ ఏర్పడి వంద వసంతాలు కావస్తున్ననూ క్రమంగా శ్రామిక వర్గానికి దూరమవుతూనే ఉంది. అంతిమంగా జాతీయ హోదాని సైతం కోల్పోయి ప్రజా విశ్వాసానికిదూరం కావడం దరిమిలా నేటికిని అధికారానికి చేరుకోలేకపోవడం పెను విషాదకరం.కమ్యూనిస్ట్ పార్టీలో అసంఖ్యాక చీలికలు కూడా అధికారానికి ఆమడ దూరానఉంచుతున్నాయి అని అర్థం చేసుకోవచ్చు. కమ్యూనిస్ట్ పార్టీలలో చీలికల మూలంగా

కమ్యూనిస్ట్ వ్యతిరేక పార్టీలు సులువుగా అధికారంలోకి రావడానికి పరోక్షంగాదోహదపడుతున్నాయి అని నిర్దిష్టంగా చెప్పవచ్చు.నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీలలో కూడా సైద్ధాంతిక స్పష్టత కొట్టొచ్చినట్లుగానే కనిపిస్తుందిఅని భావించవచ్చు. ఈ తరుణంలోనే వామపక్షాలు సైద్ధాంతిక స్పష్టతతో కొనసాగలేకపోతే తత్ఫలితంగా ప్రతికూలమైన ఫలితాలు సంభవిస్తాయి' అని నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలిఇటీవల ప్రస్తావించడం విశిష్ట ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. 'వాస్తవికమైన సైద్ధాంతికవైరుధ్యాలకు బదులుగా వ్యక్తిగతమైన పట్టుదలల వలన కమ్యూనిస్ట్ పార్టీలకు తీవ్ర నష్టంజరుగుతూనే ఉంది. ఖచ్చితమైన సరైన విషయాలను వ్యతిరేకించే పెదధోరణి నేపాల్‌కమ్యూనిస్ట్ ఉద్యమంలోనూ ఉంది. వ్యక్తిగతమైన ప్రయోజనాల నిమిత్తం కొందరు కావాలనివిభజన రేఖలను సృష్టించారు' అని ఆయన ఆవేదనని వ్యక్తం చేయడాన్ని ఈ సందర్భంగాప్రత్యేకంగా గమనించవచ్చు.ఈ పరంపరలోనే ముఖ్యంగా 'సైద్ధాంతిక స్పష్టత లేకపోతే కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీవ్రహాని జరుగుతుంది అనేది వాస్తవం. అందువలన సైద్ధాంతిక పునాదులు చాలా గట్టిగాఉండాలి. అంత బలమైన పునాదులు ఉన్న సైద్ధాంతిక ఆలోచనలనే ఇచ్చి పుచ్చుకోవాలి.లేకపోతే కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీవ్రమైన హాని మాత్రమే కాకుండా ప్రతికూలమైన ఫలితాలుసైతం సంభవిస్తాయి. సరైన సైద్ధాంతిక అవగాహన లేకుండా మరియు దిశా నిర్దేశం లేకుండాఅనేక అపసవ్య దిశలలో పయనిస్తూ ఆలోచనలను విస్తరించుకోవడం అనేది ఏమాత్రంసహేతుకం కాదు. ఈ విధంగా దిశారహిత గమనంగా ముందుకు సాగడం పూర్తిగా అర్థరహితం.అలాగే కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఒనగూడుతున్న మొండి పట్టుదల ధోరణులను విడనాడాల్సినఅవసరం తప్పకుండా ఉంది' అని నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి ప్రముఖంగాప్రస్తావిం చడాన్ని బట్టి కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టతకి పెద్దపీట వేయాల్సిన అవసరాన్నినొక్కి చెప్తుంది అని చాలా స్పష్టంగా గమనించవచ్చు. ఆయన వ్యాఖ్యలు కమ్యూనిస్ట్ పార్టీలపురోగమనానికి ఎంతగానో దోహదపడతాయి అని విస్పష్టంగా చెప్పవచ్చు. ఆ క్రమంలోనే'బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ' అనే భావనని ఆయన చాలా బలంగా సమర్థించడాన్నిసైతం చాలా స్పష్టంగా గమనించవచ్చు. అంతిమంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆయా కమ్యూనిస్ట్ పార్టీలు తమ వర్గ విభేదాలకు అతీతంగా 'సైద్ధాంతిక స్పష్టత' గీటురాయిగా ప్రాధాన్యం ఇస్తూ సమసమాజ స్థాపన లక్ష్యంగా పురోగమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

**- జె.జె.సి.పి. బాబూరావు**
**రీసెర్చ్ స్కాలర్-సెల్: 94933 19690**

# హైదరాబాద్ అగ్ని విపత్తు: నగర భద్రత సంస్కరణకు ఒక హెచ్చరిక







హైదరాబాద్లోని ఇటీవలి అగ్ని ప్రమాదం, ప్రాణాలను కబళించి భవనాలను బూడిదగా మార్చిన ఈ దుర్ఘటన, నగర భద్రతా నియమాల్లోని వ్యవస్థాపక వైఫల్యాలను మళ్లీ మనకు గుర్తుచేస్తుంది. ఈ ప్రమాదానికి కారణాలు ప్రస్తుతం విచారణలో ఉన్నప్పటికీ, ఇలాంటి విపత్తులు ఎల్లప్పుడూ ఒకే మాదిరి కథనాన్ని అనుసరిస్తాయి %-% అజాగ్రత్త, నియంత్రణ ఉదాసీనత, సిద్ధపడకపోవడం. ఇప్పుడు కష్టప్రశ్నలు అడగాల్సిన సమయం వచ్చింది: భారతీయ నగరాలు ఎందుకు అగ్ని ప్రమాదాలకు గురవుతున్నాయి? ఈ నివారించదగ్గ విపత్తుల చక్రాన్ని ఎలా విరమించాలి?

**విపత్తు వివరణ:**

హైదరాబాద్ తాజా ఘటనతో సహా భారతదేశంలోని నగర అగ్ని ప్రమాదాలు, సాధారణంగా అనేక కారణాల మిశ్రమం నుండి పుడతాయి. పాత విద్యుత్ వైర్లు లేదా ఎక్కువ భారం తగిలిన వ్యవస్థల వల్ల విద్యుత్ తెగడాలు ప్రధాన కారణాలు. దట్టమైన జనాభా ఉన్న ప్రాంతాల్లో, అక్రమ నిర్మాణాలు, సులభంగా మండే పదార్థాలతో నిండిన ఇరుకైన వాణిజ్య ప్రదేశాలు "అగ్నికి ఆహుతి అయ్యే స్థలాలుగా" మారుతున్నాయి. పొగ గుర్తించే సాధనాలు ఏర్పాటు చేయడం, తప్పించుకునే మార్గాలను అడ్డంకులు లేకుండా ఉంచడం, సాధనాభ్యాసాలు నిర్వహించడం వంటి భద్రతా నిబంధనలు తరచుగా ఉపేక్షించబడతాయి. నియమాలు ఉన్నా, అమలు బలహీనంగా ఉంటుంది. కట్టడాల కోసం నిర్మాణ సంస్థలు భద్రతను త్యాగం చేస్తారు, అధికారులు విపత్తు వరకు కళ్లు మూసుకుంటారు.

పాత ప్రాంతాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక మార్గాల మధ్య ఉన్న హైదరాబాద్ ఈ ద్వంద్వతను ప్రతిబింబిస్తుంది. ప్రాచీన భవనాల్లో ఆధునిక అగ్నిమాపక సదుపాయాలు లేవు, కొత్త ఎత్తైన కట్టడాలు అలంకారం కోసం భద్రతను తగ్గించుకుంటాయి. ఫలితం? అగ్నిమాపక వాహనాలు ఇరుకు వీధుల్లో ప్రయాణించడానికి ఇబ్బంది పడే నగరం, అత్యవసర సందర్భాల్లో నీటి నిల్వలు లేని ఎత్తైన భవనాలు.

**దోషారోపణకు మించిన సంక్షోభం:**

ఈ సమస్య హైదరాబాద్ కంటే విస్తృతమైనది. జాతీయ నేర రికార్డుల సంస్థ ప్రకారం, 2022లో భారతదేశంలో 8,000కి పైగా అగ్ని సంబంధిత మరణాలు నమోదయ్యాయి. ఇవి చాలావరకు నగరాల్లోనే సంభవించాయి. ఈ సంఖ్యలు నగర ప్రణాళిక, విపత్తు నిర్వహణ పట్ల ఉదాసీనతను ప్రతిబింబిస్తాయి. అగ్నిమాపక దళాలు సిబ్బంది, సాధనాల కొరతతో బాధపడుతున్నాయి. తెలంగాణలో ప్రతి 4.5 లక్షల మందికి ఒక అగ్నిమాపక కేంద్రం మాత్రమే ఉంది. సామాజిక అవగాహన చాలా తక్కువ అగ్నిని ఆర్పే సాధనాన్ని ఎలా ఉపయోగించాలో కూడా ఎంతమందికి తెలుసు?

వాతావరణ మార్పులు ఇంకా సమస్యలను తీవ్రతరం చేస్తున్నాయి. పెరిగే ఉష్ణోగ్రతలు అడవి మంటలు, విద్యుత్ ప్రమాదాల ప్రమాదాన్ని పెంచుతున్నాయి, కానీ విపత్తు నిర్వహణ ప్రణాళికలు ఈ మారుతున్న సవాళ్లను పరిగణనలోకి తీసుకోవు.

**నివారణే ప్రధానం- సంస్కరణ మార్గం:**

భవిష్యత్తు విపత్తులను నివారించడానికి భారతదేశానికి మూడు ముఖ్యమైన చర్యలు అవసరం. అవి

1. భద్రతా నిబంధనల కఠినమైన అమలు: అన్ని నివాస, వాణిజ్య భవనాలకు తప్పనిసరి అగ్ని పరిశీలనలు, నియమాల ఉల్లంఘనకు భారీ దండాలు. రాష్ట్రాలు జాతీయ భవన నియమావళిని పూర్తిగా అనుసరించాలి.
2. ఆధునిక మౌలిక సదుపాయాలు: అగ్నిమాపక దళాలకు ఎత్తైన నిచ్చెనలు, వేడిని గుర్తించే కెమెరాలు వంటి ఆధునిక సాధనాలను అందించడం, అత్యవసర నీటి సరఫరా వ్యవస్థలకు సులభ ప్రాప్యత నిర్ధారించడం. నగర ప్రణాళికలు విశాలమైన రహదారులు, ఖాళీ ప్రదేశాలను ప్రాధాన్యతనివ్వాలి.
3. ప్రజల సాధికారత: అగ్ని భద్రతపై స్థానిక స్థాయిలో జాగృతి ప్రచారాలు నడపడం. పాఠశాలలు, కార్యాలయాలు నిరంతర సాధనాభ్యాసాలు నిర్వహించాలి. భద్రతను "ప్రభుత్వ బాధ్యత" నుండి "సామూహిక బాధ్యత"గా మార్చాలి.

**సామూహిక చర్యకు పిలుపు:**

హైదరాబాద్ అగ్ని ప్రమాదం మన నిర్లక్ష్యానికి అద్దం పట్టిస్తోంది. ప్రభుత్వం సంస్కరణలకు నాయకత్వం వహించాల్సిన అవసరం ఉంది, కానీ పౌరులు కూడా నిర్లక్ష్యంగా ఉండకూడదు. అక్రమ నిర్మాణాలను నివేదించండి, అగ్ని పరిశీలనలను డిమాండ్ చేయండి, భద్రతా సాధనాల్లో పెట్టుబడి పెట్టండి. నగరాలు ఎత్తుగా, విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న కొద్దీ, వాటి స్థితిస్థాపకత కూడా అంతే వేగంగా పెరగాలి. ఈ విపత్తు మార్పుకు ఒక సూచనగా మారాలి. అగ్ని భద్రత అధికారులకు ఒక సూచిక గుర్తు కాదు ఇది మిలియన్ల ప్రజల జీవనరేఖ.

**కింజరాపు అమరావతి**
**8247286357**

### నవభూమి పాఠకులకు మనవి

మధ్యలో కొన్ని కారణాల వల్ల నిలిచిపోయిన సాహితీ పేజీ 'విభిన్న' మళ్లీ పున: ప్రారంభించబోతున్నాం. విభిన్నంగా రచయితలు,కవుల పరిచయ కార్యక్రమాన్ని చేపట్టిన 'విభిన్న' మళ్లీ మొదలు పెట్టాలంటూ కవులు,రచయితలు చేస్తున్న విజ్ఞప్తులతో మళ్లీ పేజీ నిర్వహించబోతున్నట్లు ప్రకటించడానికి ఎంతో సంతోషిస్తున్నాం.

మీ రచనలను దిగువ ఈ మెయిల్ ఐడీకి పంపండి

navabhoomidaily@gmail.com



## పాండవ పక్షాన కౌరవుడు

భక్తి

దుర్యోధనాది కౌరవుల గురించి అందరికీ తెలుసు. కానీ ధృతరాష్ట్రుడి మరో కుమారుడైన యుయుత్సుడిది కూడా మహా భారతంలో విశిష్టమైన పాత్రే. అతని తల్లి సుఖద అనే వైశ్య వనిత. యుయుత్సుడు మహా వీరుడు. అతిరథుల్లో ఒకడు. మొదటి నుంచీ దుర్యోధనుడితోనే కలిసి ఉండేవాడు. కౌరవ-పాండవ సమరం ప్రారంభమయ్యే సమయంలో "మేము అస్త్ర శస్త్రాలు పట్టింది ధర్మాన్ని రక్షించడానికి. మమ్మల్ని వ్యతిరేకించి, మమ్మల్ని ఎదిరించి పోరాడేవారందరూ ధర్మ విధ్వంసానికి పాల్పడేవారే. అలాకాకుండా ధర్మం వైపు నిలబడి ఎవరైనా పోరాడాలనుకుంటే వారికి స్వాగతం పలుకుతున్నాం" అని ధర్మరాజు చెప్పిన మాటలు యుయుత్సుణ్ణి ఆకర్షించాయి. ధర్మం పాండవులవైపే ఉందని గ్రహించాడు. తనవంతు సైన్యంతో సహా పాండవుల పక్షాన చేరి, కౌరవుల మీద యుద్ధం సాగించాడు. భారత యుద్ధం ముగిసింది. ధృతరాష్ట్రుడి కుమారుల్లో మిగిలినది యుయుత్సుడొక్కడే. "ధర్మానికి కట్టుబడిన యుయుత్సుణ్ణే కౌరవ సామ్రాజ్యానికి రాజును చేస్తాను. ఆ విధంగానైనా ధృతరాష్ట్రుడికి మనశ్శాంతి కలుగుతుంది" అని ధర్మరాజు ప్రకటిస్తాడు. అయితే ధర్మవేత్తలు దానికి అభ్యంతరం చెబుతూ... క్షత్రియ సంతతికి చెందని యుయుత్సుడు రాజు కావడానికి అనర్హుడని అంటారు.అప్పుడు పాండవ సామ్రాజ్యానికి సైన్యాధ్యక్షుడిగా యుయుత్సుణ్ణి ధర్మరాజు నియమిస్తాడు. ఆ తరువాత స్వర్గారోహణకు బయలుదేరిన పాండవులు... అభిమన్యుడి కుమారుడైన పరీక్షిత్తు సంరక్షణ బాధ్యతను యుయుత్సుడికే అప్పగిస్తారు. పాండవ పక్షాన నిలిచి పోరాడిన కౌరవుడైన యుయుత్సుడు... మహా భారతంలోని విలక్షణమైన పాత్రల్లో ఒకటి.





## పిల్లల లంచ్‌బాక్స్‌లో ఇవి వద్దు...

పిల్లలకు ఇష్టమని లంచ్‌బాక్స్‌లో రకరకాల చాక్లెట్లు, చిప్స్ పెడుతూ ఉంటారు చాలామంది తల్లులు. వీటి వల్ల పిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. పిల్లల లంచ్‌బాక్స్‌లో ఏవి పెట్టకూడదో తెలుసుకుందాం.

పళ్ల రసాల ప్యాకెట్లు: నిమ్మ, నారింజ, దానిమ్మ లాంటి రకరకాల పళ్ల రసాల ప్యాకెట్లు ప్రస్తుతం బజార్లో దొరుకుతున్నాయి. చాలామంది ఇవి ఆరోగ్యానికి మంచివనే ఉద్దేశంతో వీటిని కొని పిల్లల లంచ్‌బాక్స్‌లో పెట్టేస్తుంటారు. వీటిలో అధిక మొత్తంలో చక్కెరలు ఉంటాయి. ఎక్కువకాలం నిల్వ ఉండడం కోసం రసాయనాలు కూడా కలుపుతుంటారు. వీటివల్ల పిల్లల్లో స్థూల కాయం, దంత సమస్యలు ఏర్పడవచ్చు. ఇలాంటి పాకెట్లను లంచ్‌బాక్స్‌లో పెట్టకూడదు.

డ్రైఫ్రూట్ చాక్లెట్లు: కాజు, బాదం, పిస్తా లాంటి నట్స్, డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ వీటితో తయారు చేసిన చాక్లెట్లలో కృత్రిమ రంగులు, అధిక పరిమాణంలో చక్కెర, ఇతర కొవ్వు పదార్థాలు కూడా కలుపుతారు. వీటిని తినడం వల్ల పిల్లలకు జీర్ణ సమస్యలు వస్తాయి. తరచూ ఇలాంటి చాక్లెట్లని పిల్లలకు ఇవ్వకూడదు.

సాల్ట్ బిస్కెట్స్, చిప్స్: వీటిలో పిల్లలకు అవసరమైనదానికంటే ఎక్కువ పరిమాణంలో ఉప్పు ఉంటుంది. వీటిని తిన డం వల్ల పిల్లల ఆరోగ్యం పాడవుతుంది.

పేస్ట్రీలు, రస్కులు: వీటిని సాధారణంగా మైదాతో తయారు చేస్తూ ఉంటారు. ఇది పిల్లల ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిలో కూడా అధికంగా చక్కెర, కొవ్వు పదార్థాలు ఉంటాయి. వీటివల్ల పిల్లలకు


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
బుధవారం
21 । మే । 2025


# 'ఫేమస్ ఫోక్ సింగర్'గా కనకవ్వ

రేషన్‌కార్డు బియ్యం తెచ్చుకునే కాడ వేలిముద్ర వేసుడు తప్ప అక్షరం తెలువని ఆమె ఇప్పుడు 'ఫేమస్ ఫోక్ సింగర్'గా దృశ్యమాధ్యమాలకు ఎక్కింది. సమ్మక్క – సారలమ్మ పాట అయినా... సంక్రాంతి గీతమైనా... ఇప్పుడు ఆమెనే పాడాలే... హిట్టు కావాలే. నిన్నటిదాక నెత్తిమీద పండ్ల గంప ఎత్తుకొని మారుబేరం చేసుకునే గొట్టె కనకవ్వ (63) ఇప్పుడు కాల్ షీట్లు ఇచ్చే స్థాయికి ఎదిగింది. 'మైకు ముందర పాడితే నా పాటకే స్టూడియోళ్లు మ్యూజిక్కులు కొడుతండ్రు, పాటైనంక చప్పట్లు కొడుతున్నరు...' అంటున్న ఈ పల్లె కోయిలమ్మ ముచ్చటించింది. ఆ ముచ్చట్లు ఆమె మాటల్లోనే...

"చిన్ననాడు నేడు చిక్కుడు పెడితే... చిక్కుడు పెడితే...
గోరుచిక్కుడై గోలలెత్తి కాసు... గోరు చిక్కుడై...
వయసు నాడు నేను ఆనిగంబు(సొరకాయ) పెడితే... ఆనిగంబు పెడితే...
***ఆనిగంబు తీగంతా అల్లిబిల్లాయే...***
***ఆడోళ్ల కనతల్లి నీళ్లాకు ఎలితే... ఆడోళ్ల కనతల్లి***
***అమాస చీకటి ఆబాయి మీద... అమాస చీకాటీ...***
***మొగోళ్ల కనతల్లి నీళ్లాకు ఎలితే... మొగోళ్ల కనతల్లి***
***కోరెవెన్నెల కాసు... కోనేరు మీదా... కోరెవెన్నెల కాసు..."***

మా అవ్వ నోట ఇన్న పాట ఇది... ఇప్పుడు పాడుతుంటే అందరికీ నచ్చుతోంది.

**అవ్వే పాటల తోవ సూపింది...**

మాది సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం బొడిగెపల్లె. ఇప్పుడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఇందిరానగర్‌లో నివాసముంటున్నం. ఐదుగురు అక్కాచెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములున్న ఉమ్మడి కుటుంబంలో పుట్టిన. అందరం గోదావరిఖనిలోనే స్థిరపడ్డం. నాతోటి చెల్లెళ్లు ప్రమీల, స్వరూప సింగరేణి నర్సరీలో పని చేస్తరు. మా అవ్వ పేరు జంగంపల్లి రాజవ్వ. వ్యవసాయం చేస్తూ వ్యవసాయ కూలీగా బతికేది. ఆ ప్రాంతానికి కరువు వస్తే కప్పతల్లి ఆటకంటే ముందు మా అవ్వతో పాట పాడించేవారట. మా అవ్వ రాజవ్వ ఐదు రోజుల పాటు ఆగకుండా పాట పాడేదట. ఆమె పాట పాడితే వాన తప్పకుండా పడేదట. ఆ పాట వారసత్వం నాకు అబ్బింది. 40ఏళ్ల క్రితం గోదావరిఖనికి వచ్చినప్పుడు వరంగల్, హైదరాబాద్‌ల్లో కూడా నేను, నా పెనిమిటి (భర్త) కలిసి కూలీనాలి చేసుకున్నం. ఊళ్లె వ్యవసాయ కూలీలుగా పని చేస్తాం. పట్టణాల్లో హమాలీ పని, రైతు మార్కెట్‌లలో చేసినం. గోదావరిఖని వచ్చిన తరువాత ఏ కాలం పండ్లు వస్తే ఆ కాలంలో అమ్ముకున్నాం. పంటలు సరిగ్గా లేక పెద్ద కొడుకు, పని దొరకక చిన్న కొడుకు ఇప్పటికీ తిప్పల పడుతుండ్రు. కష్టం వచ్చినా, ఆకలి అయినా, దూప అయినా మాకు పాటే దిక్కు.

**మనవరాలు పంపిన పాటతో...**

నాలుగు నెలల క్రితం ఏదో టీవీల ఫోక్ సింగర్స్ ఉంటే ఒక్క నిమిషం పాట పాడి సెల్‌ఫోన్‌లో పంపుమని చెప్పంగా మా మనుమరాలు ఇన్నది. నిద్రలకెళ్లి లేపి మా ముగ్గురు అక్కాచెల్లెళ్లతోని పాడిచ్చి పంపింది. ఆ టీవీ వోళ్లు ఫోన్ చేసి కనకవ్వది ఒక పాట రికార్డు చేసి మళ్లీ పంపమని చెప్పింద్రు. నేను పాడి పంపిన. హైదరాబాద్‌కు రమ్మన్నరు. ఆడికి పోయినంక అదో ప్రపంచం.



అన్నీ నేర్పినోళ్లు అక్కడ ఉన్నరు. భయమైంది. కానీ నా పాట ఇన్నంక చప్పట్లు కొట్టింద్రు. కొన్నిచోట్ల ఎట్ల పాడాల్నో వాళ్లు చెప్పిండ్లు. వాళ్ల పాటలు నాకు నేర్పింద్రు. ఒకటి రెండుసార్లు ఇనంగానే నేను పాడిన. వాళ్లకు నచ్చింది. ఇగ అక్కడి నుంచి నాకు రికాం లేదు. టీవీలోళ్లు, పేపర్లోళ్లు, పాటలోళ్లు... ఇలా అందరూ నా చుట్టే తిరుగుతండ్రు. ఒక సినిమాల పాడమని అడుగుతండ్రు. ఇప్పుడు ఒక్కటేదమ్మ షూటింగ్‌లు, రికార్డింగులు, సెల్ఫీలు దిగుడు అంతా గమ్మత్ అయితంది. నన్ను చూసి 'సింగర్ కనకవ్వవు కదా' అంటండ్రు. సెలబ్రెటినంటండ్రు...

**అన్ని పాటలు పాడుతా...**

రెండుమూడేళ్లుగా మా అక్కాచెల్లెళ్ల పాటలు, మా అమ్మ చెప్పిన పాటలు జనాల్లోకి పోవాలని ఆలోచిస్తన్నం. అమ్మపాట, పల్లెపాట రికార్డు కావాలన్నది మా తపన. కోలాటం, బతుకమ్మ, ఉయ్యాలపాట, బాగోతం పాటలు, బోనాల పాటలు, ఇది గది అని కాదు... అన్నీ పాడుతం. పొలంలో ఉంటే తప్ప పాట రాదు. కానీ లోకం తీరును బట్టి ఈ మధ్య అన్నీ రకాల పాటలు నేర్చుకుంటున్నం. సినిమా పాటలు కూడా ఇంటికాడ పాడుతం. పొలం నెర్రెవారితే కండ్లళ్ల నీళ్లు తిరిగి పాట అదే తన్నుకచ్చేది. నా పాట ప్రజలు ఇనాలే, నన్ను మెచ్చుకోవాలే. సచ్చేదాక పాడుతా... ఏ పాట నేర్పినా ఆ పాట పాడుతా...



మా అమ్మపాడే పాటలళ్ల ఆడపిల్లల కష్టాలు, కన్నీళ్లు ఉండేవి. మాకు చిన్నప్పుడు తెలువకపోవు, కానీ ఆడోళ్లు కష్టాలళ్ల కుంగిపోవద్దు, వంగిపోవద్దు. ఇంట్ల బాధలనే ఆమె పాటలు పాడుకునేది. పాట రాసింది తెలువదు, కైగట్టింది ఎవరో తెలువదు, రాగం అల్లింది ఎవరో తెలువదు. అమ్మపాడితే నేనూ పాడేదాన్ని. చిన్నప్పుడు గౌరెల్లి, గోవర్ధనగిరి, హుస్నాబాద్‌లళ్ల బాగోతం ఆడుదురు. కచ్చరాలు కట్టుకుని పోదుము. ఇంటికి వచ్చే సరికి తెల్లారేది. రాత్రి ఇన్నయి తెల్లారి పాడేది అమ్మ. కాలం గాకపోతే మా అమ్మతో పాటపాడిస్తే వాన పడేదట. తొమ్మిది రోజులు బతుకమ్మ పాటలు పాడుకునేవాళ్లం. ఇప్పుడంటే డీజేలు వచ్చినయి.

నన్ను చిన్నప్పుడు బళ్లె వేస్తే చింతల కింద ఆటలాడేదాన్ని. ఆవుల కావలి పోయేదాన్ని. అచ్చరం నేర్వలేదు. పదేళ్లకే పెళ్లి అయ్యింది, మేనరికం, 16 ఏళ్లకే పెద్దబిడ్డ పుట్టింది. చిన్నప్పుడు పెళ్లి కావడంతో పెనిమిటి నేను దోస్తుల లెక్క తిరిగేటోళ్లం. మునుపటి కాలమే మంచిగుండే. అవ్వఅయ్యా చెప్పినొళ్లనే చేసుకున్నం. ఇప్పుడు ఆడోళ్లను చంపుతండ్రు, గొంతులు పిసుకుతుండ్రు. ఆడోళ్లు గుండె ధైర్యంగా ఉండాలే. మన దారిలో మనం నడవాలే.'

**–సహాయ**

# అల్లం... అమృతం



తడిగా ఉన్న అల్లపు దుంపని ఆర్ద్రకం అంటారు. దీనినే శృంగవేరి అనికూడా పిలుస్తారు. ఎండిన అల్లానికి శొంఠి అని పిలుస్తారు. ఎండిన అల్లానికి కొమ్ములు ఉంటాయి కాబట్టి– దీనిని తెలుగులో శొంఠికొమ్ము అనటమూ ఉంది. కర్ణాటకలోని శృంగేరీ ప్రాంతంలో అల్లం బాగా పండుతుంది కాబట్టి ఆ ప్రాంతాన్ని 'శృంగవేరగిరి' అన్నారు. శంకరాచార్యుల వారు తన పీఠాన్ని ఇక్కడే ప్రతిష్ఠించారు. అదే శృంగేరిగా ప్రసిద్ధి చెందిందని చెప్తారు.

లాభాలెన్నో...అల్లానికి ఆయుర్వేదంలో ఒక ప్రత్యేకమైన స్థానముంది. స్థూలకాయం, వాపులు, అజీర్తి, మలబద్ధతలను తగ్గించటానికి దీనిని వాడతారు. గడ్డలు, ట్యూమర్లు ఏర్పడకుండా, రక్తం గడ్డకుండా రక్తప్రసారం మెరుగుపరచటంలో అల్లం కీలకమైన పాత్ర పోషిస్తుంది. అంతే కాదు.. మనం తినే పోషకాలు వంటబట్టడానికి.. వ్యాధినిరోధకశక్తి పెరగటానికి కూడా ఇవి ఉపకరిస్తాయి. ఇక అల్లాన్ని ఇతర పదార్థాలతో కలిపి తింటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.

అల్లం తురుమును బెల్లం పాకం పట్టి ఉండలుగా చేసి చప్పరిస్తే– శ్వాసకోశ వ్యాధులు తగ్గుతాయి. ఊపిరి తీసుకొనే పద్ధతిలో మార్పు వస్తుంది. నాలుకపై ఏర్పడే పలుచని జిగురు పొర తొలగిపోయి రుచి తెలుస్తుంది. గొంతు శ్రావ్యత కూడా పెరుగుతుంది.

అల్లాన్ని పాలల్లో వేసి బాగా పొంగనిచ్చి.. ఉదయాన్నే తాగితే టీబీలాంటి జబ్బులు రావు.

అల్లం రసం, నిమ్మరసం కలిపి దానిలో తగినంత ఉప్పు వేసి తాలింపు పెట్టుకోవాలి. ఇలా తయారయిన పలుచటి చట్నీని అన్నంతో కలుపుకొని క్రమం తప్పకుండా తింటే కడుపులో ఉండే నుసి పురుగులు పోతాయి. జీర్ణశక్తి మెరుగుపడుతుంది.

ఎలా తినాలి? అల్లాన్ని ఎలా తినాలనే విషయాన్ని క్షేమశర్మ– తన క్షేమకుతూహలంలో పేర్కొన్నాడు. క్షేమశర్మ చెప్పిన సూత్రం ప్రకారం– అల్లాన్ని– "భోజనాగ్రే సదాపథ్యం"లో తినాలి. అంటే భోజనంలో మొదటి ముద్దగా తినాలి. అంతే కాదు. వంకాయ, కంద వంటి కూరలు ఆరగటం కష్టమవుతుంది. అందువల్ల వాటిలో అల్లాన్ని తప్పనిసరిగా కలపాలి. తేలికగా అరిగే బీర, పొట్ల, సొర, పాలకూర, తోటకూర వంటి వాటిలో అల్లాన్ని కలపాల్సిన అవసరం లేదు.

ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలి. అల్లానికి వేడి చేసే స్వభావం ఉంది. అందువల్ల వేడి శరీర తత్వం ఉన్నవారు అల్లాన్ని పరిమితంగా తీసుకోవాలి. శరీరానికి వేడి కలిగించే వెల్లుల్లితో అసలు కలపకూడదు. అల్లం, వెల్లుల్లి – ఈ రెండు ఔషధాలు కూడా! వీటిని మితంగానే వాడాలి. అతిగా వాడితే ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయి.

# అందం.. అప్రమత్తంగా...



**మనం పాటించే చిన్నపాటి నియమాలు, జాగ్రత్తలు మేకప్ ప్రభావాన్ని ఇనుమడింపజేస్తాయి. కాబట్టి మేకప్ వేసుకోవడం మొదలుపెట్టిన తొలినాళ్లలో సాధారణంగా దొర్లే వీలున్న పొరపాట్ల పట్ల అప్రమత్తంగా నడుచుకోవాలి. అవేంటంటే...**

అన్నీ అవసరం లేదు: కాస్మటిక్స్ షాప్‌లోకి అడుగు పెట్టగానే అంతులేనన్ని ఉత్పత్తులు కళ్లను కట్టిపడేస్తాయి. ఏం కొనాలో అర్థం కాని పరిస్థితిలో, అమోమయానికి లోనై అవసరం లేని అప్లికేటర్స్ అన్నిటినీ కొనేయడం సరి కాదు. నిజానికి ఐల్యాష్ కర్లర్, భిన్నమైన మేకప్ స్పాంజ్‌లను కొనవలసిన అవసరం లేదు. అలాగే పలు రకాల బ్లష్‌లూ, లిప్‌స్టిక్‌లూ కొనవలసిన అవసరం ఉండదు. ప్రారంభంలో బేసిక్ మేకప్ కిట్ కొనుక్కుంటే సరిపోతుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఒక్కొక్క ప్రొడక్ట్ జోడించుకుంటూ వెళ్లాలి. మస్కారా, లిప్‌స్టిక్, ఐబ్రో పెన్సిల్, ఫౌండేషన్‌లతో మేకప్ మొదలుపెట్టుకోవాలి. ఈ ఉత్పత్తులుండే మేకప్ కిట్‌ను ఎంచుకోవాలి.


శుభ్రమైన ముఖానికే మేకప్: సాధారణంగా చాలా మంది మేక్‌పకు ముఖం ఎలా ఉన్నా ఫరవాలేదనుకుంటారు. మేకప్ చాటున అన్నిటినీ దాచేయవచ్చనుకుంటారు. కానీ మేక్‌పకు ముఖాన్ని సిద్ధం చేసుకోవాలంటే, ముందుగా ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. గంటల తరబడి ముఖం మీద ఉండిపోయిన మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ మీద మేకప్ అప్లై చేసుకోవడం సరి కాదు. ఈ నియమం లిప్‌స్టిక్‌కు మాత్రమే మినహాయింపు. లిప్‌స్టిక్ లేదా గ్లాస్‌ను తేలికగా రీఅప్లై చేసుకోవచ్చు. అయితే కాస్త ఖాళీ సమయం దొరికినా న్యాప్కిన్‌ను నీళ్లలో ముంచి, పెదవుల మీది లిప్‌స్టిక్ పూర్తిగా తొలగించి తిరిగి అప్లై చేసుకుంటే, మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాం.

మురికి బ్రష్‌లతో తంటా: మురికి మేకప్ బ్రష్షులతో చర్మ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. కాబట్టి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటూ ఉండాలి. ఇందుకోసం వారాంతాల్లోని తీరిక సమయాలను కేటాయించాలి. గోరువెచ్చని నీళ్లను గిన్నెలో నింపి, ఒక టీస్పూన్ షాంపూ కలిపి, బ్రష్ కుంచెలన్నీ మునిగేలా పది నిమిషాలు నానబెట్టి, వేళ్లతో సున్నితంగా రుద్ది శుభ్రం చేసి, తాజా నీళ్లలో కడగాలి. తర్వాత బ్రష్‌లను టవల్ మీద ఆరబెట్టి, దాచుకోవాలి. మేకప్ బ్రష్‌లు అదనంగా కొని పెట్టుకుంటే, అత్యవసరమైన సమయాల్లో అక్కరకొస్తాయి. పైగా ఖరీదైన బ్రష్‌లనే ఎంచుకోవాలనే నియమమేమీ లేదు. నాణ్యత విషయంలో రాజీ పడినా మేక్‌పలో అంతగా మార్పులుండవు.

కనుబొమలు ప్రధానమే: చాలా మంది ముఖంలోని అన్ని అంశాలకూ ప్రాధాన్యం ఇచ్చి, కనుబొమలను నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. అలాగని వాటిని అవసరానికి మించి దిద్దుకున్నా, ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. కాబట్టి తీర్చిదిద్దిన కనుబొమల కోసం, మ్యాట్ ఐషాడోతో కనుబొమలు దిద్దుకోవాలి. కనుబొమల రంగుకు దగ్గరగా లేదా అంతకంటే లేత రంగులో ఉండే ఐబ్రో పెన్సిల్‌నే ఉపయోగించాలి.

మేక్‌పతో నిద్ర: ఇది సరి కాదు. ఎంత అలసటతో పక్క మీద వాలిపోయినా, మేకప్ తొలగించడం మర్చిపోకూడదు. లేదంటే చర్మ రంధ్రాలు పూడుకుపోయి, ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతాయి. తర్వాతి రోజు ముఖం తాజాగా వెలిగిపోవాలంటే ముందు రోజు వేసుకున్న మేకప్ పూర్తిగా తొలగించి, చర్మానికి గాలి సోకేలా చూసుకోవాలి. మేకప్ తొలగించడానికి క్లీన్సింగ్ మిల్క్ లేదా స్వచ్ఛమైన కొబ్బరినూనె ఉపయోగించవచ్చు. మేకప్ తొలగించి, సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకున్న తర్వాత, తప్పనిసరిగా నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.

# పొట్ట తగ్గాలా.. గుడ్డు తినండి!



వ్యాయామం చేయకపోవడం, జీవనశైలిలో మార్పుల నేపథ్యంలో బరువుతోపాటు పొట్ట కూడా పెరుగుతుంది. అలాంటప్పుడు కొవ్వు పదార్థాలు తగ్గించడం మాత్రమే కాదు.. కొన్ని పదార్థాలను రోజూ తీసుకోవాలి. వాటిలోని పోషకాలు పొట్ట చుట్టూ కొవ్వు పేరుకోకుండా చూస్తాయి.

బాదం: మోనోశాచురేటెడ్ ఫ్యాట్లు శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలో నీరు కూడా పేరుకోకుండా ఉంటుంది. ఆ పోషకాలు అందాలంటే బాదంతోపాటు ఇతర నట్స్ తినాలి.

ఓట్స్: ఉదయం పూట నూనెతో చేసిన అల్పాహారాలకు బదులు ఓట్స్‌కి ప్రాధాన్యం ఇవ్వాలి. జీవక్రియల రేటు వృద్ధి అవుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తక్షణ శక్తి అంది ఎక్కువ సమయం ఆకలి వేయదు. దీనిలోని పీచు కూడా జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. ఓట్స్ తీసుకునేటప్పుడు అందులో చక్కెరకు బదులు ఏవైనా తాజా పండ్ల ముక్కలూ, రసాలు కలిపితే సహజ చక్కెర్లు అందుతాయి. పొట్ట వస్తుందనే భయం కూడా ఉండదు.

గుడ్డు: మాంసకృత్తులు అధికంగా అందించే గుడ్డు పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని కరిగించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా తెల్లసొన తీసుకోవడం వల్ల బి12, డి విటమిన్లు, ఒమెగా– 3 ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి అధికంగా అందుతాయి. ఇవి బరువు తగ్గడంలో కీలక పాత్రపోషిస్తాయి. దీనివల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. గుండె పని తీరు కూడా మెరుగవుతుంది.

పండ్లు: ఆకలిగా అనిపించినప్పుడు ఏ మిఠాయిలో, ఇతర చిరుతిళ్లో తినే బదులు.. పండ్లు ఎంచుకోవడం మంచిది. వీటి వల్ల చక్కెర్లు, కొవ్వూ అందుతాయన్న బాధ ఉండదు. పోషకాలూ ఎక్కువగా అందుతాయి. బరువూ తగ్గుతారు.

## శాకాహారం ప్రమాదమా?

మాంసాహారం శరీరాన్ని దెబ్బతీస్తుంది.. శాకాహారం తినాలని చాలామంది చెప్తుంటారు. కానీ ఇప్పుడొచ్చిన చిక్కేంటంటే.. శాకాహారమూ ప్రమాదమట. అదెలా? బరువెక్కడం.. రోగాల బారిన పడటం.. సౌందర్యం దెబ్బతినడం వంటి సమస్యల నుంచి బయటపడాలంటే మాంసాహారం తగ్గించాలని నిపుణులు చెప్తుంటారు. శాకాహారం ఎక్కువగా తీసుకోవాలంటారు. కొవ్వులను తగ్గించడం.. కొలెస్ట్రాల్‌ను నిరోధించడమే కాకుండా మెదడు చురుగ్గా పనిచేయాలంటే కూరగాయలే ఉత్తమం అని సలహా ఇస్తుంటారు. కానీ అతిగా కూరగాయలు అసలుకే ఎసరు తీసుకొస్తాయంటున్నారు హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన నిపుణులు. ఏకరీతి కూరగాయల వల్ల పెద్దగా పోషక ప్రయోజనమేమీ ఉండదట. వారానికి సరిపడా కూరగాయలు తెచ్చుకుంటాం.. అవి అయిపోగానే మళ్లీ వారానికి సరపడా తెచ్చుకుంటాం. కూరగాయల..ఆకు కూరల సంఖ్య మారుతుందే తప్ప.. వాటి స్థానం ఎప్పటికీ ఒకేలా ఉంటుంది. తిన్నవే మళ్లీ మళ్లీ తినడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలు అందవట. శాకాహారపు వేపుళ్లు ఎక్కువగా తినడం వల్ల శరీరానికి ప్రమాదమని నిపుణుల అభిప్రాయం. క్రమం తప్పిన శాకాహారం తీసుకోవడం వల్ల మొదటగా తల వెంట్రుకలు రాలిపోతాయట. తల వెంట్రుకల గట్టిదనానికి ఏకరీతి ఆహారం కాకుండా అన్ని రకాలా పోషకాలున్న ఆహారం తీసుకోవడం మంచిది. శాకాహారం వల్ల మూడ్ మారుతుందట. శాకాహారం వల్ల 25శాతం గుండెకు మంచి జరిగితే 35 శాతం ప్రమాదకరమని సర్వేలు చెప్తున్నారు. ఎక్కువగా ప్రతికూల ధోరణితో ఆలోచిస్తారట. కాబట్టి తక్కువ మోతాదులో మాంసాహారం తీసుకోవడం శ్రేయస్కరమట. ధాన్యాలు.. పండ్లు.. నట్స్.. లెగ్యూమ్స్ వంటివి శరీరానికి మంచివని సూచిస్తున్నారు.

# చెప్పకుంటేనే.. బెటర్ హాఫ్!


దంపతుల మధ్య ఎలాంటి దాపరికాలూ ఉండకూడదు. అయినా.. భాగస్వామితో చెప్పకూడని విషయాలు, చేయకూడని పనులు కూడా కొన్ని ఉంటాయని అంటున్నారు మానసిక నిపుణులు. 'బెటర్ హాఫ్ కదా!' అని ప్రతిదాన్నీ షేర్ చేస్తే.. 'సంక్రాంతికి వస్తున్నాం'లో వెంకీలా సమస్యలు ఎదుర్కోక తప్పదు. ముఖ్యంగా, ప్రేమికులు, కొత్తగా పెళ్లయిన జంటలు.. ఇలాంటి విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలని సూచిస్తున్నారు.

గతం.. గతః: ఇప్పుడిప్పుడే దగ్గరవుతున్న ప్రేమ పక్షులైనా.. కొత్తగా జీవితాన్ని ప్రారంభిస్తున్న నవ జంటలైనా.. మీ గత సంబంధాల గురించి మీ భాగస్వామికి తెలియకుండా చూసుకోండి. ఈ జీవితం మీ ఇద్దరిది మాత్రమే! కాబట్టి, మీ జీవితంలో లేని మూడో వ్యక్తి కోసం.. మీ మానసిక స్థితిని పాడు చేసుకోకండి. మీ గత సంబంధాలకు సంబంధించిన నిజం.. మీ భవిష్యత్తుకు విషంగా మారుతుందని గుర్తుంచుకోండి.

నీ ఇష్టమే.. నా ఇష్టం!: మీ భాగస్వామి ఇష్టాయిష్టాలను తెలుసుకోండి. అందుకు తగ్గట్లే వ్యవహరించండి. వారి అలవాట్లను మీ అలవాట్లుగా మార్చుకోండి. అదే సమయంలో మీతోపాటు వారి వ్యక్తిగత స్వతంత్రాన్నీ గౌరవించండి. వారికి అసౌకర్యం కలిగించే విషయాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించండి.



మీ మాటలు జాగ్రత్త..: ఎలాంటి సందర్భాల్లోనైనా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోండి. మీ భాగస్వామిని బాధపెట్టే, తప్పుడు సందేశాన్ని ఇచ్చే పదాలను ఉపయోగించకండి. మాటలను జాగ్రత్తగా ఎంచుకోండి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోకండి.



## ట్విస్ట్ ఇచ్చిన టీఎంసీ.. యూసుఫ్ ఔట్.. అభిషేక్ బెనర్జీ ఇన్



**కోల్‌కతా:-నవభూమి:** ఆపరేషన్ సింధూర్‌కు దారి తీసిన పరిణామాలను ప్రపంచ దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వ నేపథ్యంలోని ఆల్ పార్టీ బృందంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తరపున అభిషేక్ బెనర్జీ(%ూఎష్ట్రఅంష్ట్రవని దీఘఅవతీఱవవ%) వెళ్లనున్నారు. ఆ పార్టీకి జాతీయ కార్యదర్శిగా ఆయన ఉన్నారు. టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీతో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఫోన్‌లో మాట్లాడిన తర్వాత అభిషేక్ పేరు ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఆల్ పార్టీ బృందం గురించి తమకు అధికారికంగా చెప్పకుండా ఎలా పేర్లను వెల్లడిస్తారని సోమవారం మమతా బెనర్జీ ప్రశ్నించారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం సోమవారం రిలీజ్ చేసిన జాబితాలో టీఎంసీ తరపున యూసుఫ్ పఠాన్ పేరును రిలీజ్ చేసింది. యూసుఫ్ పఠాన్ పేరును ఎలా మీరు వెల్లడిస్తారని టీఎంసీ పార్టీ కేంద్రాన్ని ప్రశ్నించింది. విదేశాంగ విధానం కేంద్ర ప్రభుత్వానిదని, కానీ ఏ నిర్ణయం తీసుకున్నా, పార్టీకి చెప్పాలని మమతా అభిప్రాయపడ్డారు . పేర్లు వెల్లడించే అంశంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమె తప్పుపట్టారు. ఉగ్రవాదంపై పోరును కొనసాగించే నేపథ్యంలో ఏడు బృందాలను విదేశాలకు కేంద్రం పంపుతున్న విషయం తెలిసిందే. మమతా బెనర్జీ తన అసహనాన్ని వ్యక్తం చేయడంతో ఆ బృందం జాబితా నుంచి యూసుఫ్ పఠాన్ తప్పుకున్నారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11
హైదరాబాద్
బుధవారం
21 । మే । 2025

## గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుకు ఊరట..!



**బెంగుళూరు-నవభూమి:** గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావు తో పాటు తరుణ్ రాజ్ కొండూరు కు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ఇద్దరికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. రూ.2లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్‌ని ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని.. దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని.. భవిష్యత్‌లో ఇదే తరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది. ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ 60 రోజుల్లోగా చార్జిషీట్‌ని దాఖలు చేయలేకపోయారు. ఈ క్రమంలో రన్యారావు, తరుణ్ రాజ్ ఇద్దరు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు.. షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. కన్నడ నటి అయిన రన్యారావును మార్చి 3న బంగారం స్మగ్లింగ్ కేసులో డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. విమానాశ్రయంలో ఆమెను అదుపులోకి తీసుకొని.. రూ.12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. 14.2 కిలోల విదేశీ బంగారు కడ్డీలను తీసుకెళ్తున్నట్లు ఆమె గుర్తించింది. ఇదే కేసులో తరుణ్ రాజ్, సాహిల్ సకారియా జైన్‌లను అరెస్టు చేశారు. ప్రస్తుతం ముగ్గురు బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర జైలులో ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 22న కేంద్రం ముగ్గురిపై కొఫిపోసా చట్టాన్ని ప్రయోగించింది. బెయిల్ లేకుండా దాదాపు సంవత్సరం పాటు నిందితులను నిర్బంధించడానికి చట్టం వీలు కల్పిస్తుంది. ఇటీవల రాన్యా తల్లి చట్టం కింద ఆమెను నిర్బంధించడాన్ని సవాల్ చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. అభ్యంతరాలు దాఖలు చేయాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ విచారణ జూన్ 3వ తేదీకి వాయిదాపడింది.

## విచారణను ఆ మూడు అంశాలకే పరిమితం చేయాలని.. 'సుప్రీం'కు కేంద్రం విజ్ఞప్తి



**న్యూఢిల్లీ-నవభూమి:** వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే.. దాన్ని మూడు అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరపున వాదనలు వినిపిస్తూ.. గత బెంచ్ లాగానే విచారణను పరిమితం చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనానికి తెలిపారు. కోర్టు మూడు అంశాలను గుర్తించిందని తుషార్ మెహతా తెలిపారు. ఆ మూడు అంశాలపై సమాధానం ఇచ్చామని.. తాజాగా పిటిషనర్లు లిఖితపూర్వక సమర్పణల్లో అనేక ఇతర అంశాలను లేవనెత్తుతున్నారన్నారు. తాము మూడు అంశాలపై అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలనేది కేంద్రం తరఫున విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ వాదనను పిటిషనర్లు వ్యతిరేకించారు. పిటిషనర్ల తరపున హాజరైన న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి సొలిసిటర్ జనరల్ వాదనను వ్యతిరేకించారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బై-యూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ-నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇదిలా ఉండగా.. మూడు అంశాల విషయానికి వస్తే.. వక్ఫ్ బై యూజర్ లేదంటే.. వక్ఫ్ బై డీడ్ కింద వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తులను తొలగించే అధికారం కాగా.. రాష్ట్రాల వక్ఫ్ బోర్డులు, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ ముస్లిమేతరులను నియమించడాన్ని ముస్లింలు వ్యతిరేకించడం రెండో అంశం కాగా.. మూడో అంశం నిబంధనకు సంబంధించింది. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్ అధికారం ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

## ఐబీ చీఫ్ తపన్ దేకా పదవీకాలం మరో ఏడాది పొడిగింపు




**న్యూఢిల్లీ-నవభూమి:** నిఘా విభాగాధిపతి (ఐబీ చీఫ్) తపన్ కుమార్ దేకా పదవీకాలాన్ని కేంద్రం మరోసారి పొడిగించింది. కేబినెట్ నియామకాల కమిటీ మరో ఏడాది పాటూ ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం నిర్ణయంతో 2026 జూన్ వరకు ఆయన ఐబీ చీఫ్‌గా కొనసాగనున్నారు. హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు చెందిన దేకా 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 1998లో ఐబీలో చేరారు. 2022 జూలై ఒకటో తేదీన ఆయన ఐబీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2024లో ఆయన పదవీకాలాన్ని కేంద్రం ఏడాది పాటూ పొడిగించింది. ఈ ఏడాది జూన్ వరకూ ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ గతేడాది ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన పదవీకాలం ముగియనుండటంతో మరోసారి పొడిగించింది.

# 75 బుల్డోజర్ల ఎంట్రీ.. 2500 ఇళ్లు నేలమట్టం



**అహ్మదాబాద్-నవభూమి:** ఆక్రమణలపై ప్రభుత్వాలు కన్నెర్ర చేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో ఇలాంటి ఆక్రమణల గురించి ఫిర్యాదు అందితే చాలు.. బుల్డోజర్లు రంగంలోకి దిగుతున్నాయి. ఆక్రమణలను నేలమట్టం చేస్తున్నాయి. మన దగ్గర ఆక్రమణల విషయంలో హైడ్రా ఎంత దూకుడుగా వ్యవహరిస్తుందో చూస్తూనే ఉన్నాం. తాజాగా మరోచోట కూడా ఇలాంటి సీన్ రిపీట్ అయ్యింది. ఏకంగా 2500 ఇళ్లను కూల్చి వేయడానికి 75 బుల్డోజర్లు రంగంలోకి దిగాయి. ఆ వివరాలు..

ఈ సంఘటన గుజరాత్, అహ్మదాబాద్‌లో వెలుగు చూసింది. అక్రమ నిర్మాణాలపై అక్కడి ప్రభుత్వం కన్నెర్ర చేసింది. గతంలో మొదటి దశలో భాగంగా 3 వేల ఇళ్లను ఇలానే నేలమట్టం చేయగా.. రెండో దశలో భాగంగా తాజాగా 2,500 ఇళ్లను కూల్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఇందుకు గాను 75 బుల్డోజర్లు రంగంలోకి దిగాయి. అధికారులు మంగళవారం చందోలా సరస్సు ప్రాంతంలో ఉన్న ఈ అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసేందుకు రంగంలోకి దిగారు. ఈ నిర్మాణాల్లో ఎక్కువ భాగం.. బంగ్లాదేశీయులవే అంటున్నారు అధికారుల. వారు అక్రమంగా దేశంలోకి ప్రవేశించడమే కాక.. ఇక్కడ ఇంటి నిర్మాణాలు కూడా చేసుకున్నారని తెలిపారు. మొదటి దశంలో భాగంగా ఏప్రిల్ 29, 30 తేదీల్లో3 వేల ఇళ్లను కూల్చి వేశారు. ఇప్పుడు రెండో దశలో భాగంగా మరో 2,500 ఇళ్లను నేలమట్టం చేసేందుకు రెడీ అయ్యింది సర్కార్. అక్రమ నిర్మాణాలను తొలగించి.. భూమిని స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు. కూల్చివేతలు సజావుగా సాగేందుకు 75 బుల్డోజర్లు, 150 డంపర్లను మోహరించారు. అలానే కూల్చివేతల సమయంలో అల్లర్లు, ఆందోళనలు చెలరేగకుండా.. శాంతిభద్రతలను కాపాడటానికి ఏకంగా 8వేల మంది సిబ్బందితో కూడిన భారీ పోలీసు బలగాలను మోహరించారు. ప్రస్తుతం కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నివేదికల ప్రకారం.. చందోలా సరస్సు చాలా కాలంగా పత్రాలు లేని బంగ్లాదేశ్ వలసదారులకు నిలయంగా మారినట్లు అధికారులు గుర్తించారు. నాలుగు దశబ్దాల క్రితం అనగా సుమారు 1970-80 సమయం నుంచే ఈ ప్రాంతంలో ఆక్రమణలు మొదలయ్యాయి. 2002లో ఒక ఎన్‌జీఓ ఇక్కడ సియాసత్ నగర్ అనే స్థావరాన్ని స్థాపించడానికి సహాయం చేసిందని నివేదికలు చెబుతున్నాయి. ఆ తరువాత ఈ ప్రాంతం మానవ అక్రమ రవాణా, నకిలీ డాక్యుమెంటేషన్ నెట్‌వర్క్‌లకు హాట్‌స్పాట్‌గా మారిందని అధికారులు వెల్లడించారు.

010-2024 మధ్య కాలంలో ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు భారీగా పెరిగాయి. సరస్సు సమీపంలోని ప్రభుత్వ భూమిలో వేలాది తాత్కాలిక ఇళ్ళు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. గత కొన్ని వారాలుగా గుజరాత్ పోలీసులు వేలాది మంది అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో చాలామంది అహ్మదాబాద్‌లో నివసిస్తున్నట్లు గుర్తించారు. వీరిలో అధిక సంఖ్యలో చందోలా సరస్సు ఆక్రమణ మండలాల్లో నివసిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. అధికారుల ప్రకారం.. ఈ ఆపరేషన్ లక్ష్యం ప్రభుత్వ భూమిని తిరిగి పొందడం మాత్రమే కాదు, చట్టవిరుద్ధమైన వలసలను అరికట్టడం మాత్రమే కాక, మురికివాడల ముసుగులో పనిచేస్తున్న నేరస్థుల నెట్‌వర్క్‌లను నిర్మూలించడం కూడా అని అధికారులు స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ ఖనిజ సంపదపై సీఎం హిమంత బిశ్వ శర్మ షాకింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** పాకిస్థాన్‌లోని కల్లోలిత బలూచిస్థాన్ ప్రాంతాన్ని ఆర్థికంగా, రాజకీయంగా దోచుకుంటున్నారని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ అన్నారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, భారీగా ఖనిజ సంపద ఉన్నా.. పాకిస్థాన్ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌ను దశాబ్దాల నాటి నుంచి పాక్ పాలకులు ఆర్థికంగా, రాజకీయంగా దోచుకుంటున్నారని హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. బలూచిస్థాన్ ప్రావిన్స్‌పై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఈ మేరకు పోస్టు పెట్టారు.

"బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో భారీగా ఖనిజ సంపద ఉన్నప్పటికీ ఆ ప్రాంతం తీవ్రమైన నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాల నాటి నుంచి బలూచిస్థాన్ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ ఎక్కువ అయింది. పాకిస్థాన్‌లోని మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికిపైగా బలూచిస్థాన్‌లోనే ఉంది, అయినా పాకిస్థాన్ పాలకులు పట్టించుకోవడం లేదు. అక్కడ భారీగా రాగి, బంగారు నిక్షేపాలు కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజం, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి కూడా ఉంది" అని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ పోస్టులో పేర్కొన్నారు. బలూచిస్థాన్‌లో సుయ్ గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు 1952లో కనుగొన్నారని, 2020 నాటికి పాకిస్థాన్‌కు సుమారుగా 56 శాతం సహజ వాయువును బలూచిస్థాన్ ప్రావిన్సే అందిస్తోందని హిమంత బిశ్వ శర్మ చెప్పుకొచ్చారు. బలూచిస్థాన్లోని గ్వదర్ పోర్టు 770 కిలోమీటర్ల తీర ప్రాంతాన్ని కలిగి ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో స్వచ్ఛమైన తాగు నీరు, విద్యుత్, ప్రాథమిక మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవని అన్నారు. ప్రభుత్వ రంగ ఉపాధిలో బలూచిస్థాన్ ప్రాంతం వాటా కూడా చాలా తక్కువగా ఉందని హిమంత పేర్కొన్నారు. బలూచిస్థాన్ ప్రాంతం ఖనిజ పుట్టెడు సంపదతో నిండిపోయి ఉంటే, అక్కడ నివసించే ప్రజలు మాత్రం పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. బలూచిస్థాన్ ప్రాంతంలో వనరుల కొరత లేదని, పాలకుల నిర్లక్ష్యం మాత్రం తీవ్రంగా ఉందన్నారు. దాని వల్లే ఆ ప్రాంతం తీవ్రంగా దోపిడీకి గురవుతున్నట్లు హిమంత బిశ్వశర్మ తెలిపారు. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పాక్ ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు బలోచిస్థాన్ కూడా స్వాతంత్రం కోసం పాకిస్థాన్‌తో పోరాడుతోంది. ముఖ్యంగా బలూచిస్థాన్ రచయిత మీర్ యార్ బలూచ్.. బలూచిస్థాన్ స్వాతంత్ర్యాన్ని నాలుగు రోజుల క్రితమే ప్రకటించారు. త్వరలోనే తమ కొత్త దేశం స్వాతంత్ర్య వేడుక కూడా జరుగుతుందని.. మిత్ర దేశాల అధినేతలు తమ దేశానికి వచ్చి జాతీయ కవాతును వీక్షించాలని, ఆశీర్వదించాలని కోరారు. కానీ వీటిపై ఇప్పటి వరకు ఏ ఒక్క దేశమూ స్పందించలేదు. అలాగే పాకిస్థాన్ కూడా అధికారికంగా దీన్ని ధ్రువీకరించలేదు.

## చరిత్ర సృష్టించిన సీఐఎస్‌ఎఫ్ మహిళా ఆఫీసర్.. ఎవరెస్ట్ ఎక్కిన గీతా సమోట



**న్యూఢిల్లీ-నవభూమి:** సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూర్టీ ఫోర్స్‌కు చెందిన మహిళా ఆఫీసర్ గీతా సమోట చరిత్ర సృష్టించారు. అసాధారణ రీతిలో ధైర్యసాహసాలు ప్రదర్శించి.. ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కిన తొలి సీఐఎస్‌ఎఫ్ మహిళా అధికారిణిగా నిలిచారు. ఎవరెస్టు శిఖరం 8,849 మీటర్ల ఎత్తు ఉన్న విషయం తెలిసిందే. ఆమె సాధించిన ఘనత పట్ల సీఐఎస్‌ఎఫ్ సీనియర్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఇది వ్యక్తిగత విజయం మాత్రమే కాదు అని, ఇండస్ట్రియల్ సెక్యూర్టీ దళంలో మహిళా శక్తిని చాటిందన్నారు. పర్వతాలు సమానత్వానికి చిహ్నాలని, అవి మన జెండర్ గురించి పట్టించుకోవలని, కేవలం ఎక్స్ ఫ్యాక్టర్ ఉన్న వాళ్లు మాత్రమే ఆ శిఖరాలను అధిరోహించగలరని గీత పేర్కొన్నది. రాజస్థాన్‌లోని సికర్ జిల్లాకు చెందిన గీత.. పల్లెటూరు నుంచి వచ్చింది. చాక్ గ్రామంలో ఓ పేదింట్లో ఆమె పుట్టింది. ఆమె నలుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. కాలేజీ రోజుల్లో ఆమె హాకీ ఆడేది. అయితే గాయం వల్ల ఆమె కెరీర్‌కు బ్రేక్ వచ్చింది. కానీ కొత్తగా పర్వతారోహణకు శ్రీకారం చుట్టింది. 2011లో ఆమె సీఐఎస్‌ఎఫ్‌లో చేరింది. 2015లో ఔలీలో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆమె పర్వతారోహణ శిక్షణ తీసుకున్నది. 2017లో మౌంటెనీరింగ్ అడ్వాన్స్ ట్రైనింగ్ పూర్తి చేసింది. 2019లో ఉత్తరాఖండ్‌లోని సతోపంత్(7075 మీ), నేపాల్‌లోని లోబోచి(6119 మీ) పర్వతాలను ఎక్కారు. 2021లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కాలని ప్లాన్ చేసిందామె. కానీ ఆ ప్లాన్ వికటించడంతో.. ఏడు ఖండాలకు చెందిన ఏడు శిఖరాలను ఎక్కే ప్లాన్ చేసింది. ఆస్ట్రేలియాలోని మౌంట్ కోసిజుకో, రష్యాలోని మౌంట్ ఎల్‌బ్రస్, టాంజానియాలోని కిలిమంజారో, అర్జెంటీనాలోని అకోన్కాగువా పర్వతాలను కేవలం ఆరు నెలల తేడాలో ఎక్కారు. ఆ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా గుర్తింపు తెచ్చుకున్నది. లడాఖ్‌లోని రుప్షు ప్రాంతంలో 5వేల మీటర్ల ఎత్తున్న అయిదు పర్వతాలను ఎక్కారు.

## శత్రు దేశాలకు స్ట్రాంగ్ మెసేజ్.. గూస్‌బంప్స్ తెప్పిస్తోన్న వాయుసేన వీడియో



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' ను విజయవంతంగా చేపట్టిన విషయం తెలిసిందే. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను త్రివిధ దళాలు సమన్వయంతో ధ్వంసం చేశాయి. కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించి ఉగ్రమూకల పనిపట్టాయి. ఇక ఆపరేషన్‌కు సంబంధించిన దృశ్యాలను మన బలగాలు గత కొన్ని రోజులుగా ఎక్స్ వేదికగా షేర్ చేస్తున్నాయి. తమ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ శత్రు దేశాలకు స్ట్రాంగ్ మెసేజ్ ఇస్తున్నాయి. తాజాగా భారత వాయుసేన కూడా ఆ తరహా వీడియోను పంచుకుంది. 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఎల్లప్పుడూ దృఢ సంకల్పంతో ప్రతిస్పందిస్తుంది' అంటూ తన సంసిద్ధత, సామర్థ్యాన్ని ప్రదర్శించింది. వైమానిక దళ విన్యాసాలు, కమాండర్ల వేగవంతమైన ప్రతిస్పందన, శత్రు స్థావరాలపై మిస్సైల్ దాడులను అందులో ప్రదర్శించింది. ఐఏఎఫ్ ఎక్స్‌లో పోస్టు చేసిన ఈ వీడియో గూస్‌బంప్స్ తెప్పిస్తోంది.

### ఆసియాలో జేఎన్ 1 వేరియంట్ విజృంభణ..
## భారత్‌లోనూ కొవిడ్ కేసుల పెరుగుదల




**న్యూఢిల్లీ-నవభూమి:** 2019లో వెలుగుచూసిన కరోనా మహమ్మారి.. ప్రపంచ దేశాలను ఎంతలా వణికించిందో తెలిసిందే. లక్షలాది మందిని బలిని తీసుకోగా.. కోట్లాదిమంది ఈ వైరస్ బారిన పడి అనేక అవస్థలు పడ్డారు. అయితే ఆ తర్వాత కూడా పలు కరోనా వేరియంట్లు ప్రపంచ దేశాలపై విరుచుకుపడ్డాయి. ఇక ఇటీవలి కాలంలో కొవిడ్ మహమ్మారి పూర్తిగా అంతం అయిపోయింది అనుకుంటున్న తరుణంలో మళ్లీ కేసుల పెరుగుదల తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. ఇందులో ఆగ్నేయాసియా దేశాల్లో కొత్త కేసుల పెరుగుదల ఇటీవలి కాలంలో మళ్లీ కొత్త భయాలను రేకెత్తిస్తోంది. సింగపూర్, హాంకాంగ్, థాయిలాండ్, చైనా దేశాల్లో కరోనా కేసులు క్రమక్రమంగా పెరుగుతుండటంతో ఆయా దేశాల ప్రభుత్వాలు అలర్ట్ అయ్యాయి. మన దేశంలోనూ కొవిడ్ కేసుల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. ఈ కేసుల వ్యాప్తికి జేఎన్ 1 వేరియంట్ కారణమని పేర్కొన్నారు. ఈ వేరియంట్‌ను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. "వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్"గా ప్రకటించింది. హాంకాంగ్ సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్ ప్రకారం.. వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. కొవిడ్ టెస్ట్‌ల్లో పాజిటివ్‌గా తేలిన శాతం గతేడాది.. అత్యధిక స్థాయికి చేరుకున్నట్లు పేర్కొంది. మే 3వ తేదీ నాటికి వారం రోజుల్లోనే హాంకాంగ్‌లో 31 తీవ్రమైన కేసులు నమోదైనట్లు తెలిపింది. ఇది గత 12 నెలల గరిష్ఠమని బ్లూమ్‌బెర్గ్ నివేదిక వెల్లడించింది. మరోవైపు.. సింగపూర్‌లో మే 3వ తేదీతో ముగిసిన వారంలో కొవిడ్-19 కేసుల సంఖ్య 28 శాతం పెరిగి.. 14,200కు చేరుకున్నట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కొవిడ్ వైరస్ సోకి రోజువారీ ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య కూడా దాదాపు 30 శాతం పెరిగినట్లు పేర్కొంది. గత సంవత్సర కాలంలో సింగపూర్ ప్రభుత్వం ఇలా అధికారిక కొవిడ్ లెక్కలను విడుదల చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

థాయ్‌లాండ్‌లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. మే 17వ తేదీతో ముగిసిన వారంలో కోవిడ్ కేసులు 33,030కి పెరిగాయి, అంతకుముందు వారంలో నమోదైన 16 వేల కేసులతో పోలిస్తే ఇది రెట్టింపు కావడం గమనార్హం. బ్యాంకాక్‌లో అత్యధిక కేసులు నమోదు అయ్యాయి. 30 నుంచి 39 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారిలో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. థాయ్ ప్రజారోగ్య అధికారులు ముఖ్యంగా ప్రమాదకర సమూహాల్లో ఉన్నవారికి బూస్టర్ టీకాలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్‌లో జరిగిన సాంగ్‌క్రాన్ ఫెస్టివల్ తర్వాత కేసుల పెరుగుదల కనిపించింది. అదే సమయంలో చైనాలో కూడా కరోనా కేసులు పెరుగుతున్నాయి. మార్చి 31వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు.. దేశవ్యాప్తంగా ఔట్‌పేషెంట్, ఎమర్జెన్సీ ఇన్‌ఫ్లుఎంజా లాంటి కేసుల్లో కొవిడ్ పాజిటివిటీ రేటు 7.5 శాతం నుంచి 16.2 శాతానికి పెరిగిందని చైనా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది.

భారత్‌లో పరిస్థితి

భారత్‌లో కూడా గత వారం రోజుల్లో కొవిడ్ కేసుల సంఖ్య స్వల్పంగా పెరిగినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా గత వారం 257 క్రియాశీల కేసులు నమోదైనట్లు తెలిపింది. అయితే ఇప్పటివరకు కరోనా వ్యాప్తికి సంబంధించి ఎలాంటి సంకేతాలు లేవని.. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తునట్లు అధికారులు పేర్కొంది.

ఆసియాలో కొవిడ్ 19 కేసుల పెరుగుదలకు ప్రధాన కారణం జేఎన్ 1 వేరియంట్, దాని సబ్ వేరియంట్లు అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇది ఓమిక్రాన్ వేరియంట్‌కు సబ్ వేరియంట్ అని వెల్లడించాయి. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ జేఎన్ 1ను "వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్"గా గుర్తించింది. అయితే దాన్ని ఇంకా "వేరియంట్ ఆఫ్ కన్సర్న్"గా ప్రకటించలేదు. అంటే ప్రస్తుత పరిస్థితిని అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. అయితే ఇది ఇతర ఓమిక్రాన్ సబ్ వేరియంట్ల వలె తీవ్రమైన వ్యాధిని కలిగిస్తుందని ఇప్పటివరకు నిర్దిష్ట ఆధారాలేమీ లేవు.

## గుంతల రోడ్లతో తీవ్ర అనారోగ్య సమస్యలు.. రూ.50 లక్షలు ఇవ్వాలంటూ వ్యక్తి నోటీసులు

**బెంగళూరు-నవభూమి:** నగరంలోని రోడ్లు అధ్వాన్నంగా మారాయి. వాటిపై ప్రయాణించడం వల్ల ఓ వ్యక్తికి తీవ్ర ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ముఖ్యంగా వెన్ను నొప్పి వల్ల అనేక ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని.. ఫలితంగా తాను మానసికంగా కూడా అనారోగ్యానికి గురయ్యానని చెప్పాడు. అందుకు నష్ట పరిహారంగా రూ.50 లక్షలు చెల్లించాలని కోరుతూ.. బృహత్ బెంగళూరు మహానగర పాలికకు లీగల్ నోటీసులు పంపాడు. అయితే దీనిపై బీబీఎంపీ ఇప్పటి వరకు స్పందించలేదు. కానీ తనకు నష్ట పరిహారం చెల్లించకపోతే మాత్రం చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సదరు వ్యక్తి కోరుతున్నాడు. బెంగళూరులోని రోడ్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. ఎక్కడ చూసిన రోడ్లన్నీ పాడైపోయి, గుంతలు పడగా.. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ముఖ్యంగా ప్రతీరోజు ద్విచక్రవాహనాలు నడిపే వారికి మాత్రం అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. అందరిలాగే ఓ వ్యక్తికి కూడా తీవ్రమైన వెన్ను నొప్పి వచ్చింది. దీంతో అనేక ఆస్పత్రులకు తిరిగినా ఫలితం మాత్రం లేకపోయింది. కేవలం వెన్నునొప్పే కాకుండా మరిన్ని ఆరోగ్య సమస్యలు కూడా రాగా.. మానసికంగానూ కుంగిపోయాడు. ఇందుకు కారణం గుంతలు పడ్డ రోడ్లేనని గుర్తించి బృహత్ బెంగళూరు మహానగర పాలికకు రూ.50 లక్షల నష్ట పరిహారం కోరుతూ లీగల్ నోటీసులు పంపాడు. బెంగళూరులోని రిచ్‌మండ్ టౌన్‌లో నివాసం ఉండే 45 ఏళ్ల దివ్య కిరణ్.. స్థానిక ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. తాము క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ.. నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలం అయిందని వెల్లడించాడు. ముఖ్యంగా బీబీఎంపీ రోడ్ల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోవడం లేదని చెప్పుకొచ్చాడు. రోడ్లన్నీ పూర్తిగా నాశనం అయినా, గుంతలు పడినా అసలు లెక్కచేయట్లేదని, కనీసం వాటిని బాగు చేయించడం కూడా చేయట్లేదని వెల్లడించాడు. దీని ఫలితంగా అనేక మంది అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నాడు. ముఖ్యంగా తాను ప్రతిరోజూ ద్విచక్ర వాహనంపైనే ఆఫీసుకు వెళ్తుంటానని దివ్య కిరణ్ స్పష్టం చేశాడు. దీంతో రోడ్లపై గుంతలు ఉండడం వల్ల తీవ్రమైన వెన్ను నొప్పి వచ్చిందని.. ఇది మాత్రమే కాకుండా మరెన్నో అనారోగ్య సమస్యలు వచ్చాయని వివరించాడు. వీటిని తగ్గించుకునేందుకు ఆస్పత్రులకు వెళ్లే డబ్బులు విపరీతంగా ఖర్చు అవుతున్నాయే తప్ప తన సమస్య మాత్రం తీరలేదని అన్నాడు. ముఖ్యంగా మెడ, వెన్ను నొప్పి వల్ల తాను ఆర్థోపెడిక్ వైద్యుడి వద్దకు ఐదు సార్లు, ఫిలోమినా ఆసుపత్రిలో నాలుగు సార్లు అత్యవసర చికిత్స తీసుకున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే అనేక ఇంజెక్షన్లు, మందులు కూడా తీసుకున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఈ నొప్పులు రావడానికి కారణం గుంతలు పడ్డ రోడ్లేనని కూడా వైద్యులు ధ్రువీకరించారని దివ్య కిరణ్ చెప్పుకొచ్చాడు. ఈ మేరకు తాను న్యాయవాది కేవీ లవీన్‌ను కలిశానని.. తన అభ్యర్థన మేరకు న్యాయవాది మే 14వ తేదీన బీబీఎంపీకి ఈ నోటీసులు పంపినట్లు చెప్పాడు. 15 రోజుల్లోగానే తనకు రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించడంతో పాటు లీగల్ ఖర్చుల కింద రూ.10 వేలు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నాడు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించాడు. అయితే ఇప్పటి వరకు ఈ నోటీసులపై బీబీఎంపీ స్పందించలేదు.



# ‘వార్ 2’ టీజర్‌కి సూపర్ రెస్పాన్స్ : అభిమానులకు ఎన్టీఆర్ కృతజ్ఞతలు



నేడు నందమూరి అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు కావడంతో ఆయనకు బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. ఆయన నటిస్తున్న వార్ 2 నుంచి చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ టీజర్ యూట్యూబ్‌తో పాటు ఇతర సోషల్ మీడియాలో దూసుకుపోతుంది. అయితే ఈ టీజర్‌కి వస్తున్న రెస్పాన్స్‌కి సంబంధించి తన అభిమానులకు జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ సందర్భంగా ఒక నోట్ విడుదల చేశాడు.జూనియర్ ఎన్టీఆర్ తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. తన సినీ ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, ఎప్పుడూ అభిమానులే ముందుగా గుర్తుకొస్తారని ఆయన అన్నారు. “నాకు నిరంతరం తోడుగా ఉండి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన నా ప్రియమైన అభిమానులకు ధన్యవాదాలు” అని ఆయన పేర్కొన్నారు. ‘వార్ 2’ టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించడం పట్ల జూనియర్ ఎన్టీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. “వార్ 2 టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఆగస్టు 14న మీరందరూ సినిమాను చూడటానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను” అని ఆయన తెలిపారు.అలాగే, తన శ్రేయోభిలాషులు, మీడియా, చిత్ర పరిశ్రమలోని సహోద్యోగులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. “నా శ్రేయోభిలాషులందరికీ, మీడియాకు, చిత్ర పరిశ్రమలోని నా సహోద్యోగులకు మీ హృదయపూర్వక శుభాకాంక్షలకు బిగ్ థాంక్యూ. ఎప్పటికీ కృతజ్ఞుడిని” అంటూ తన ప్రేమను తెలియజేశారు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ ‘దేవర’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

# బుల్లి రాజుని చిరంజీవి బుక్ చేసారా?



సంక్రాంతికి వస్తున్నాంతో రేవంత్ భీమల అలియాస్ బుల్లిరాజు ఏ రేంజ్లో వైరల్ అయ్యాడో తెలిసిందే. ఓవర్ నైట్ లోనే చైల్డ్ ఆర్టిస్ట్ గా ఫేమస్ అయిపోయాడు. సినిమాలో బుల్లి రాజు బూతు పురాణంతోనే ఇది సాధ్య మైంది. 300 కోట్ల వసూళ్లలో బుల్లి రాజు పాత్ర ఎంతో కీలకమైంది. దీంతో బుల్లి రాజుకు అవకాశాలు క్యూ కట్టాయి. ఇప్పటికే చాలా సినిమాలకు సైన్ చేసినట్లు వినిపిస్తుంది. రోజుకు 50వేలు ఇచ్చిమరీ బుల్లి రాజు కోసం పోటీ పడుతున్నారని తెలిసిందే. %రూశ్రీంశీ =ఝుఎ% - కూలీ %జం% వార్ 2.. ఎవ్వరు తగ్గట్లే.. కొందరైతే ఒక్క రోజుకి లక్ష రూపాయలు కూడా ఆఫర్ చేస్తున్నారుట. ఈ నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కూడా బుల్లిరాజును బుక్ చేసుకున్నట్లు వినిపిస్తుంది. అనీల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇది పక్కా కామెడీ ఎంటర్ టైనర్. అనీల్ స్టోరీ చెబుతున్నప్పుడే పడి పడి నవ్వినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బుల్లిరాజు కూడా సినిమాలో ఉంటే బాగుంటుందని అనీల్ ని అడి గారుట. అందుకు అనీల్ తప్పకుండా తీసుకుందామని చెప్పారుట. చిరంజీవి మంచి కామెడీ టైమింగ్ ఉన్న నటుడు. అలాంటి హీరోకి బుల్లిరాజు తోడైతే థియేటర్లో నవ్వులు పువ్వులే. ఇద్దరి కాంబినేషన్ లో సన్నివేశాలు సినిమాకే హైలైట్ గా ఉంటాయి. సంక్రాంతి సినిమాలో వెంకీ-బుల్లిరాజు అలా హైలైట్ అవ్వడంతోనే సినిమా గొప్ప విజయం సాధించింది. ప్రస్తుతం చిరంజీవి సినిమాకు సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇందులో హీరోయిన్ గా నయనతార ఎంపికైంది. భారీ పారితోషికం ఇచ్చి మరీ రంగంలోకి దించారు. ఇటీవలే ఓ ప్రమోషనల్ వీడియో కూడా చేసి రిలీజ్ చేయడంతో 157 బజ్ రెట్టింపు అయింది. హాట్ బ్యూటీతోనూ అనీల్ కామెడీ పండిచబోతున్నాడని తెలుస్తుంది.

# అందాల సీతాకోక చిలుక



హీరోలతో పోల్చితే హీరోయిన్స్ కెరీర్ స్పాన్ తక్కువగా ఉంటుంది. ఆరు పదుల వయసులోనూ హీరోలు మూడు పదుల వయసు పాత్రల్లో నటిస్తూ ఉంటారు. అయితే హీరోయిన్స్ మాత్రం అలా కాదు. వారి వయసు పెరుగుతున్నా కొద్ది ఆఫర్లు తగ్గుతూ ఉంటాయి. సాధారణంగా హీరోయిన్స్ పది నుంచి పదిహేను ఏళ్ళు ఇండస్ట్రీలో కొనసాగగలరు. అంతకు మించి ఎక్కువ కాలం హీరోయిన్స్ ఇండస్ట్రీలో ఉన్నారు అంటే వారు ఖచ్చితంగా అరుదైన వారు. అలాంటి అరుదైన హీరోయిన్స్ సౌత్ ఇండియాలో కొద్ది మంది మాత్రమే ఉంటారు. వారిలో స్టార్ హీరోయిన్ త్రిష ఒకరు అనడంలో సందేహం లేదు. ఇండస్ట్రీలో ఆమె అడుగు పెట్టి పాతిక ఏళ్లు అవుతోందిత్రిష 1999లో జోడీ సినిమాలో నటించడం ద్వారా ఇండస్ట్రీకి పరిచయం అయింది. ఆ సినిమా పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టకున్నా, హీరోయిన్‌గా తమిళ సినిమా ఇండస్ట్రీలో ఆఫర్లు దక్కించుకుంది. ఎంట్రీ ఇచ్చిన ఆరంభంలోనే ఏడాదిలో అర డజను సినిమాలు చేయడంతో ఒక్కసారిగా సౌత్ ఇండియన్ సినీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేయడం ద్వారా టాప్ స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో త్రిష ప్రస్థానం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈమె టాలీవుడ్‌లోని దాదాపు అందరు స్టార్ హీరోలకు జోడీగా నటించిన విషయం తెల్సిందే. రెండు జనరేషన్స్ హీరోలతో నటించింది. ప్రస్తుతం ఈమె కమల్ హాసన్‌తో కలిసి నటించిన థగ్ లైఫ్ సినిమా ప్రమోషన్‌లో పాల్గొంటుంది. ఆ సమయంలోనే ఇలా సీతాకోక చిలుకల డిజైన్‌తో మంచి ఔట్ ఫిట్ ధరించింది. ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చి పాతిక ఏళ్లు అవుతున్న నేపథ్యంలో త్రిష వయసు ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయినా కూడా ఇంకా రెండు పదుల వయసులో ఉన్నట్లుగానే ఈ ఔట్ ఫిట్‌లో చాలా అందంగా, కలర్ ఫుల్ సీతాకోక చిలు మాదిరిగా ఉంది అంటూ నెటిజన్స్ నుంచి కామెంట్స్ దక్కించుకుంది. అందమైన సీతాకోక చిలుక మరిన్ని సంవత్సరాలు సినిమా ఇండస్ట్రీలో వెలుగు వెలగాలని అభిమానులతో పాటు, ఇండస్ట్రీ వర్గాల వారు అంతా కూడా కోరుకుంటున్నారు. వయసు పెరుగుతున్నా కొద్ది త్రిష చాలా అందంగా కనిపిస్తుందని అభిమానులు అంటూ ఉంటారు. ఈ ఫోటోలను చూస్తే నిజమే అనిపిస్తోందని కొందరు అంటున్నారు. ఇంత అందంగా ఉంది కనుక ముద్దుగుమ్మ త్రిషకి రెగ్యులర్‌గా సినిమా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం విశ్వరూపం, సూర్య45, రామ్ అనే మలయాళ సినిమాలోనూ నటిస్తోంది.

# కీరవాణి మ్యాజిక్.. పవన్ ఫిదా!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరిహర వీరమల్లు సినిమాపై మళ్లీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల షూటింగ్ పూర్తి చేసిన పవన్ మేకర్స్ తో మరింత క్లోజ్ గా సినిమా అవుట్ ఫుట్ పై చర్చలు జరపడం విశేషం. ఇక నెక్స్ట్ కొత్త సాంగ్ ‘సలసల మరిగే నీలోని రక్తమే%ూ%’ మే 21న రిలీజ్ కానుంది. ఈ గీతాన్ని ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఎంఎం కీరవాణి స్వరపరిచి, సాహిత్యం అందించారు. “మనలోని పౌరుషం, వీరత్వం ఎన్నటికీ చల్లబడకూడదు” అనే భావనతో ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని రగిల్చేలా ఈ పాట రూపొందింది.కీరవాణి చరణాకోలతో వీరత్వాన్ని తట్టిలేపే ఈ గీతం, నేటి పరిస్థితుల్లో మనలో చేవ జారకూడదనే సందేశాన్ని ఇస్తుందని ప వ న్ కళ్యాణ్ అన్నారు. హరిహర వీరమల్లు సినిమాకు కీరవాణి అందించిన సంగీతం, నేపథ్య సంగీతం కథలోని భావోద్వేగాలను శిఖర స్థాయికి తీసుకెళ్తాయని పవన్ కొనియాడారు. కీరవాణి గారు ఈ సినిమాకు నిజంగా ప్రాణం పోశారు. ఆయన తపన, అంకిత భావంతో స్వరాలు అందించడం చూశాను. ‘మొదటిసారి మీతో చేస్తున్నాను, అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తారు కదా, అందుకు తగ్గట్లు ఉండాలి’ అని ఆయన చెప్పడం ఆయనలోని నిబద్ధతను చూపిస్తుంది” అని పవన్ అన్నారు. కీరవాణి తన సంగీత ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అందుకున్నారు. చక్రవర్తి వద్ద శిష్యరికం నుంచి వేటూరి, సిరివెన్నెల లాంటి గొప్ప రచయితలతో అనుబంధం వరకు ఆయన ప్రయాణం అద్భుతం. తెలుగు కథలను ఇష్టపడే కీరవాణి, 32 కథల సంకలనాన్ని సిద్ధం చేసుకున్నారు, అందులో ఆయన రాసిన రెండు కథలు కూడా ఉన్నాయి. ఈ సంకలనం ఆయన సాహిత్య ప్రేమను, సృజనాత్మకతను చూపిస్తుంది. కీరవాణి సంగీత దర్శకుడిగా మాత్రమే కాక, చక్కటి సాహిత్య రచయితగా కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన పదాలు రచయితలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పవన్ అన్నారు. “తెరపై రెండున్నర గంటల సినిమా కనిపిస్తుంది, కానీ కీరవాణి గారు నెలల తరబడి తపనపడి స్వరాలు అందిస్తారు. తెలుగు పాటను ఆస్కార్ వేదికపైకి తీసుకెళ్లిన ఆయన, వీరమల్లు తో మరోసారి అదరగొట్టనున్నారు” అని పవన్ కొనియాడారు.హరిహర వీరమల్లు జూన్ 12, విడుదల కానుంది. కీరవాణి సంగీతం, పవన్ కళ్యాణ్ యాక్షన్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రచ్చ చేయనుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక ‘సలసల మరిగే నీలోని రక్తమే%ూ%’ సాంగ్ ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి. ఈ సినిమాను క్రిష్ దర్శకత్వంలో మొదలు పెట్టగా జ్యోతిక్రిష్ణ ఫినిషింగ్ టచ్ ఇచ్చారు.

# రష్మికకు పోటీనే లేదా?



నేషనల్ క్రష్ రష్మికకు పోటీగా మరో నాయిక లేదా? ఇండస్ట్రీలో ఆమె చెప్పిందే వేదంగా పని చేస్తుందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. యానిమల్‌పుష్ప-2-, ఛావావిజయాలతో రష్మిక పాన్ ఇండియా లో తారా స్థాయికి చేరింది. అమ్మడు నటించిన ‘సికిందర్’ తప్ప అన్ని చిత్రాలు భారీ విజయాలు అందుకు న్నవే. సికిందర్ రూపంలో భారీ వైఫల్యం ఎదురైనా? ఆ ప్రభావం ఎక్కడా రష్మికపై కనిపించలేదు. దీంతో అమ్మడికి ఎదురే లేకుండా సాగిపోతుంది. ప్రస్తుతం ఫోకస్ అంతా బాలీవుడ్ పైనే పెట్టింది. అలాగని టాలీవుడ్ ఛాన్సులు మిస్ చేసుకోలేదు. మంచి అవకాశాలు వస్తే నో చెప్పకుండా కమిట్ అవుతుంది. వచ్చే అవకాశాలు కూడా అలాంటివే. పారితోషికం కూడా భారీగా పెంచేసింది. ఒక్కో సినిమాకు భారీగా డిమాండ్ చేస్తుంది. రూపాయి తగ్గడానికి వీల్లేదంటూ కండీషన్లు పెడుతుందట. టెర్మ్స్ అండ్ కండీషన్స్ తూచ తప్ప కుండా పాటిస్తుందిట.ఒకప్పుడులా ఇప్పుడు సెట్స్ లో అదనంగా సమయం కేటాయించలేదట. టైమ్ కి రావడం వెళ్లిపోవడం అన్నట్లే ఉంటుందిట. అలాగని దర్శక, నిర్మాతలను ఇబ్బంది పెట్టలేదుట. వాళ్ల మాటలకు విలువ నిస్తూనే పని చేస్తుందట. టైమ్ రష్మికది కాబట్టి ఇప్పుడేం చేసినా చెల్లుతుంది. ఇక ఇండస్ట్రీలో రష్మికకు రీప్లేస్ మెంట్ నాయిక లేదని కూడా గట్టిగా వినిపిస్తుంది. రష్మిక నటించాల్సి వస్తే తాను చేయాల్సిందే తప్ప మరో నటితో రీప్లేస్ మెంట్ చేద్దామంటే డైరెక్టర్లు కూడా రాజీకి రావడం లేదుట. రష్మిక ఎనర్జీని మరే నటి మ్యాచ్ చేయలేకపోవడంతోనే ఈ రకమైన ఇబ్బంది ఎదుర వుతుందని కొంత మంది దర్శక, రచయితలు అభిప్రాయపడుతున్నారు. రష్మికని పక్కనబెట్టి కొత్త భామలతో రిస్క్

# టాలీవుడ్‌లో కాస్టింగ్ కౌచ్: సయామీ ఖేర్ సంచలన ఆరోపణలు



సినీ పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనేది ఎప్పటినుంచో చర్చనీయాంశంగానే ఉంది. తాజాగా, ప్రముఖ నటి సయామీ ఖేర్ తనకు కెరీర్ ఆరంభంలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. తెలుగు చిత్రసీమకు చెందిన ఓ మహిళా ఏజెంట్ సినిమా అవకాశాల కోసం తనను “సర్దుకుపోవాలని” కోరినట్లు ఆమె వెల్లడించడం గమనార్హం. అయితే, తాను అలాంటి పనులకు దూరంగా ఉంటానని, కొన్ని పరిమితులు తనకు ఉన్నాయని ఆమెకు స్పష్టం చేసినట్టు వివరించారు. సయామీ ఖేర్ 2015లో ‘రేయ్’ అనే తెలుగు సినిమాతో తన సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 2016లో ‘మిర్జియా’తో హిందీలో అడుగుపెట్టారు. ‘మౌళి’, ‘చోక్డ్’, ‘వైల్డ్ డాగ్’, ‘ఘూమర్’ వంటి చిత్రాలతో పాటు ‘స్పెషల్ ఆప్స్’, ‘ఫాదూ’ వంటి వెబ్ సిరీస్‌లలో కూడా ఆమె నటించి మెప్పించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తనకు వచ్చిన అవకాశాల పట్ల సంతోషంగా ఉన్నానని, అయితే కెరీర్ మొదట్లో ఓ సంఘటన తనను తీవ్రంగా బాధించిందని తెలిపారు.సయామీ మాట్లాడుతూ, “నా కెరీర్ తొలినాళ్లలో, ఓ తెలుగు సినిమా ఏజెంట్ నన్ను కలిశారు. సినిమా అవకాశాల కోసం కొన్ని విషయాల్లో ‘సర్దుకుపోవాల్సి’ ఉంటుందని ఆమె నాతో అన్నారు. ఒక మహిళ అయి ఉండి మరో మహిళతో ఇలా మాట్లాడటం నన్ను ఆశ్చ ర్యానికి గురి చేసింది” అని వివరించారు.ఆ ఏజెంట్ మాటలకు తాను మొదట అర్థం కానట్లు నటించానని, కానీ ఆమె పదేపదే అదే విషయం ప్రస్తావించడంతో, “క్షమించండి, మీరు నన్ను ఆ మార్గంలో వెళ్లమని సూచిస్తున్నారని అనుకుంటున్నాను. కానీ నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి, వాటిని నేను ఎప్పటికీ దాటను,” అని సున్నితంగా తిరస్కరించినట్లు సయామీ తెలిపారు. తన సినీ జీవితంలోఇలాంటి ప్రతిపాదన రావడం అదే మొదటిసారి, చివరిసారి.

# నెట్టింట చక్కర్లు కొడుతున్న ప్రీతిజింటా ఫొటో.. పంజాబ్ కింగ్స్ ఓనర్ ఏమన్నదంటే..?



బాలీవుడ్ నటి, ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు సహ యజమాని అయిన ప్రీతి జింటా వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. సోషల్ మీడియాలో ఆమెకు సంబంధించిన ఫొటో ఒకటి చక్కర్లు కొడుతున్నది. ఇంతకీ ఆ ఫొటోలో ఏముందంటే.. రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు వైభవ్ సూర్యవంశిని కౌగిలించుకున్నట్లుగా ఉన్నది. అయితే, ఈ ఫొటోపై ప్రీతి జింటా ఘాటుగానే స్పందించింది. ఆ ఫొటో ఫేక్ ఫొటో అని.. మార్ఫింగ్ చేశారని.. అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ అసలు విషయాన్ని నిర్ధారించుకోకుండానే.. మార్ఫింగ్ ఫొటోను ఉపయోగించి ఓ వెబ్‌సైట్ కథనం ప్రచురించడంతో తాను షాక్ అయ్యాయనని సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అయితే, ఈ నెల 18న రాజస్థాన్ రాయల్స్-పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది.

మ్యాచ్ అనంతరం ప్రీతి జింటా.. ఆర్ఆర్ యువ బ్యాటర్స్ వైభవ్ సూర్యవంశితో కరచాలనం చేసింది. అయితే, ఫొటోను రాజస్థాన్ రాయల్స్ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లోనూ పోస్ట్ చేసింది. అయితే, ఈ ఫొటోను మార్ఫింగ్ చేసి పలువురు ఇంటర్నెట్‌లో వైరల్ చేశారు. కొద్ది సమయంలోనే ఫొటో వైరల్ కాగా.. ఇదే అంశంపై గుజరాత్‌కు చెందిన వెబ్‌సైట్ సైతం ఓ కథనం ప్రచురించింది. దీనిపై ప్రీతి సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ఫొటోలు ఎలాంటి వాస్తవం లేదని.. అది ఫేక్ అని స్పష్టం చేసింది. పలువురు నెటిజన్స్ ప్రీతికి మద్దతు ప్రకటించారు. ఓ యూజర్ ఈ విషయంలో కోర్టుకు వెళ్లాలని నటికి సూచించారు. మరొకరు మీడియాలో విశ్వసనీయత పడిపోయిందనేదానికి ఇదొక ఉదాహరణ.. కేవలం వ్యూస్, టీఆర్పీ కోసం ఇంకొకరి ఇమేజ్‌తో ఆడుకోవడం తప్పు అంటూ కామెంట్ చేశాడు. ఇదిలా ఉండగా.. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో పంజాబ్ జట్టు గెలువడంతో ప్లేఆఫ్‌లో స్థానం సంపాదించుకుంది. మ్యాచ్ అనంతరం ప్రీతి జింటా మైదానంలో చాలా ఉత్సాహంగా కనిపించింది. ఆటగాళ్లను అభినందించింది.

# జింబాబ్వేతో ఏకైక టెస్టు.. ఇంగ్లండ్ జట్టులో పేస్ సంచలనం..!



సొంతగడ్డపై త్వరలో జరుగబోయే భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్ సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలోనే జింబాబ్వే తో ఏకైక టెస్టు ఆడనుంది బెన్ స్టోక్స్ బృందం. మే 22న మ్యాచ్ ఉన్నందున ఇంగ్లండ్ మంగళవారమే తమ తుది జట్టును ప్రకటించింది. యువ పేసర్ సామ్ కుక్ (%ఝఎ జశీశీఎ%) ఈ మ్యాచ్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. అట్కిన్సన్, జోష్ టంగ్‌తో కలిసి అతడు కొత్త బంతిని పంచుకుంటాడని హెడ్ కోచ్ మెక్‌కల్లం వెల్లడించాడు. 2003 తర్వాత ఇంగ్లండ్ గడ్డపై జింబాబ్వేకు ఇదే తొలి టెస్టు కావడం విశేషం.ఈ ఏడాది సమ్మర్‌లో ఇంగ్లండ్ పురుషుల జట్టుకు ఇదే తొలి టెస్టు మ్యాచ్. దాంతో, విజయంతో సీజన్‌ను ఆరంభించాలని బెన్ స్టోక్స్ సేన భావిస్తోంది. అందుకే.. కీలకమైన ఆటగాళ్లకు తుది జట్టులో చోటు కల్పించింది. దేశవాళీలో ఎస్సెక్స్ జట్టు తరఫున వికెట్ల వేట కొనసాగిస్తున్న సామ్ కుక్ ఈ టెస్టుతో డెబ్యూట్ క్యాప్ అందుకోనున్నాడు.ఇంగ్లండ్ తుది జట్టు : జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జేమీ స్మిత్(వికెట్ కీపర్), గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, సామ్ కుక్, షోయబ్ బషీర్.

నవక్రీడ

# ఐపీఎల్‌లో ‘ఎక్స్‌ట్రా’ టైమ్ .. ప్లే ఆఫ్స్ వేళ బీసీసీఐ కీలక నిర్ణయం



ఐపీఎల్ 18వ సీజన్ పునరుద్దరణ తర్వాత నిబంధనలను సడలి స్తున్న బీసీసీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తాత్కాలిక ఆటగాళ్లను తీసుకునేందుకు అనుమతిచ్చిన బోర్డు.. ప్లే ఆఫ్స్ నేపథ్యంలో తీపికబురు చెప్పింది. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయాన్ని పెంచుతున్నామని బీసీసీఐ తెలిపింది. ఇప్పటివరకూ ఉన్న అదనపు సమయాన్ని వ ం ం గ ం ట క ం పొడిగించింది. అంటే.. ఇకపై ప్రతి మ్యాచ్‌కు 120 నిమిషాలు ఎక్స్ ట్రా టైమ్ వర్తిస్తుంది. మే 20 నుంచే ఈ నిబంధన అమల్లోకి వస్తుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. మ్యాచ్ వేళల పొడిగింపు విషయంలో క్లాజ్ 13.7.3 ప్రకారం ఈ మార్పులు చేసినట్టు స్పష్టం చేసింది. దాంతో, వర్షం కారణంగా టాస్ ఆలస్యమైనా ఈ రెండు గంటల అదనపు సమయం కలిసి వస్తుందని ఫ్రాంచైజీలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**